
గరిష్ఠం 31.0
కనిష్ఠం 24.0



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.20 (309.6546)	1,67,448	1,67,448
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,280.99	1,280.99
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.3577 (43.2558)	1,40,113	88,934

చికెన్ ధరలు | లైవ్ : రూ.144 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240




ఎన్నాళ్లీ తాత్సారం!

- విద్యుత్‌శాఖలో భారీగా పోస్టుల ఖాళీలు
- జేఎల్‌ఎం, అసిస్టెంట్ లైన్‌మన్ల పోస్టుల భర్తీలో జాప్యం
- సిబ్బంది కొరతతో క్షేత్ర స్థాయిలో అందని సేవలు
- ఖాళీల భర్తీపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- విద్యుత్ శాఖ ఖాళీలపై దృష్టిసారించని ప్రభుత్వం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యుత్ శాఖలో భారీగా పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యుత్ వినియోగదారులకు సేవలు అందడం లేదు. గృహ విద్యుత్‌తో పాటు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సేవలు అందించాల్సిన పోస్టులే ఖాళీగా ఉండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి గ్రీన్ సిగ్నల్ లేకపోవడంతో పోస్టులపై ఎటూ తేలడం లేదు.
- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ/ నల్లగొండటౌన్)

జిల్లాలో అసిస్టెంట్ లైన్‌మెన్‌లు, జూనియర్ లైన్‌మెన్ల నియామకాన్ని విద్యుత్ శాఖ పట్టించుకోకుండా ఉంటుందన్న ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది కొరత కారణంగా ప్రస్తుతం ఉన్న సిబ్బందిపైనే భారం పడుతుంది. దీం తో ప్రస్తుతం ఉన్న సిబ్బంది అత్యధిక గంటలు డ్యూటీ చేయడంతో వారు మానసికంగా, ఆరోగ్యపరంగా దెబ్బతింటున్నారు. గాలిదుమారాలు, వర్షాలకు, ఇతర కారణాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణం కరెంటు పునరుద్ధరించడం కష్టమవుతుంది. మూడు జిల్లాల్లో వ్యవసాయ, గృహ విద్యుత్ అన్ని కలిపి మొత్తం 19,32,183 కనెక్షన్‌లు ఉన్నట్లు తెలుస్తుంది. ఇందులో అత్యధికంగా గృహ విద్యుత్ కనెక్షన్‌లే ఉండటంతో తరచుగా కరెంటుకు అంతరాయం కలిగితే పునరుద్ధరించడం సమస్యగా మారుతుంది. 2023లో కొంత మేరకు జూనియర్ లైన్‌మెన్‌ల నియామకం చేపట్టినప్పటికీ వారిని క్షేత్ర స్థాయిలో వినియోగించుకోకుండా 50శాతానికి పైగా జూనియర్ లైన్‌మెన్‌లను సబ్‌స్టేషన్లకు పరిమితం చేశారు. దీంతో ఫీల్డ్‌లో పని చేసే వారు లేక అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.



లైన్‌మన్లపై పనిభారం

ప్రస్తుతం పనిచేస్తున్న లైన్‌మన్లపై భారం పడుతున్నా కొత్త నియామకాలు లేకపోవడంతో పనిచేస్తున్న సిబ్బంది తీవ్ర పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలు కానరావడం లేదు. నియామకం విషయంలో ప్రభుత్వం పదేపదే ప్రకటనలు చేయడం తప్ప పోస్టుల భర్తీలో జాప్యం చేస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నల్లగొండ జిల్లాలో మొత్తం 194 అసిస్టెంట్ పోస్టులు ఉం డగా, 144 మంది పనిచేస్తున్నారు. ఇంకా 50 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా జూనియర్ లైన్‌మెన్ పోస్టులు 272 మంది ఉండగా విధుల్లో 150 మంది ఉన్నారు. ఇంకా 122 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదే విధంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 90 అసిస్టెంట్ పోస్టులు ఉండగా 62మంది పనిచేస్తున్నారు. ఇంకా 28 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు సూర్యాపేట జిల్లాలో 210 మంది జెఎల్‌ఎం పోస్టులు ఉండగా, 110 మంది మాత్రమే పనిచేస్తున్నారు. సుమారు 100 పోస్టుల వరకు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. అత్యధికంగా జూనియర్ లైన్‌మెన్ పోస్టులే ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో పనిచేసే ఒక్కో..

- మిగతా 8వ పేజీలో...

సిబ్బంది కొరత వాస్తవమే

క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమే. అయినప్పటికీ విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు ఎలాంటి అంతరాయం తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. యాజమాన్యం నుంచి వచ్చిన ఆదేశాల అనంతరం త్వరలోనే పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకుంటాం. అప్పటి వరకు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.
- వెంకటేశ్వర్లు, ఎస్ఈ, నల్లగొండ

పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితా ప్రచురణ రేపు

జడ్పీ సీఈవో శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీనివాసరావు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రాదేశిక నియోజకవర్గాలవారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితాను ఈ నెల 10న మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రచురించనున్నట్లు జడ్పీ సీఈవో శ్రీనివాసరావు తెలిపారు. ముసాయిదా పోలింగ్‌కేంద్రాల జాబితా, ఓటరు జాబితాలను ఈ నెల 6న ప్రచురించిన నేపథ్యంలో సోమవారం ఆయన తన ఛాంబర్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 33 మండలాలకు 33 జడ్పీటీసీలు, 33 ఎంపీపీలు, 353 ఎంపీటీసీలున్నాయని, మొత్తం 1,956 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 10,73,506 ఓటర్లున్నారని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాల పై ఈ నెల 6న నుంచి 8 వరకు అభ్యంతరాలు స్వీకరించామని, ఈ నెల 9న అభ్యంతరాల పరిష్కారం, 10న తుది ఓటరు జాబితాను, పోలింగ్ కేంద్రాల జాబితాను మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్‌లలో ప్రచురిస్తామన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే వెంటనే తెలియజేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నుంచి గుమ్మల మోహన్‌రెడ్డి, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పశువుల్లో లంపి వ్యాధి కలకలం

- వైరస్‌తో మృత్యువాతపడుతున్న దూడలు
- రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యుల సూచన



డిండి మండలంలోని పశువులకు లంపి చర్మవ్యాధి సోకింది. దూడల పై వైరస్ తీవ్ర ప్రభావం చూపి మృత్యువాతపడుతున్నాయి. పశువులు మేతమేయకపోవడం, నీరసంగా ఉండడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలు కనిపించడం రైతులను ఆందోళనకు గురిచేస్తుంది. గాలి, నీరు, ఆహారం ద్వారా కూడా పశువులు ఈ వ్యాధి బారిన పడుతున్నాయి. గుర్తించేలోపే వ్యాధి తీవ్రత పెరిగి మృతి చెందుతున్నాయి.
- (ఆంధ్రజ్యోతి-డిండి)

- వివరాలు 7లో..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కలెక్టర్



గుర్రంపోడు కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

గుర్రంపోడు,సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి):పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మండలకేంద్రంలోని కేజీబీవీ,పీహెచ్‌సీ,ఎంపీడీవో కార్యాలయాలను సోమవారం తనిఖీచేశారు. వంట గది,డైనింగ్, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండగా పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ, ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ న్నారు.

మండల ప్రత్యేక అధికారులు పాఠశాలలను సందర్శించాలి

నల్లగొండ టౌన్: మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా పాఠశాలలను సందర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని వారికి అవగాహన కల్పించాలన్నారు. జాతీయ కుటుంబ ప్రాయోజన పథకం కింద బాగా పనిచేసిన ఉద్యోగులను ఈ నెల 13వ తేదీన మంత్రులు సన్మానిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, ఇన్‌చార్జి డీఆర్వో, వై. అశోక్‌రెడ్డి, ఆర్డీవో రమణారెడ్డి, శ్రీదేవి, గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మూడు నెలలుగా ఆగిన పింఛన్.. స్పందించిన కలెక్టర్

తన కుమారుడికి మూడు నెలలుగా పింఛన్ రావడం లేదని బాధితుడి తల్లి మండల స్థాయి అధికారుల వద్దకు వెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. సోమవారం కలెక్టర్ దృష్టికి వెళ్లిన వెంటనే వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం నెల్లికల్లు గ్రామానికి చెందిన బోయ సత్యనారాయణరెడ్డి కుమారుడు వెంకటరామిరెడ్డి పోలియోతో మరుగుజ్జుగా సొంత పనులు కూడా చేసుకోలేని స్థితిలో ఉన్నాడు. మూడు నెలల క్రితం ఫేషియల్ రీడింగ్ ద్వారా పింఛన్ ఇస్తుండడంతో వెంకటరామిరెడ్డికి కళ్లు కంప్యూటర్‌లో స్పష్టంగా కనపడకపోవడంతో పింఛన్ ఆగిపోయింది. దీంతో తల్లిదండ్రులు అతనిని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి దీనస్థితిని వివరించారు. స్పందించిన కలెక్టర్ బాధితుడికి ఇవ్వాలని ఆదేశించారు.

డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేయాలి

మర్రిగూడ: ప్రభుత్వం నియమించిన చోట కాకుండా ఉపాధ్యాయురాయిలిని డిప్యూటేషన్‌పై ఎందుకు పంపించారని కలెక్టర్ ఇలా త్రిపాఠి డీఈవో భిక్షపతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాంపల్లి మండలం నరసింహులగూడెం పాఠశాలకు రోహిణిని ప్రధానోపాధ్యాయురాలిగా నియమితులయ్యారు. అనారోగ్యం పేరుతో రోహిణి ఓడీపై మునుగోడు మండలంలోని పులిపలుపుల పాఠశాలకు విద్యాశాఖ అధికారి డిప్యూటేషన్ వేశారు. హెచ్‌ఎంను పాఠశాలకు పంపించాలని, ఇద్దరు ఉపాధ్యాయులలో ఒకరిని డిప్యూటేషన్ వేయడంతో ఒక ఉపాధ్యాయుడితో ఇబ్బందిగా ఉందని పాఠశాల విద్యార్థినిలు, గ్రామస్థులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ డీఈవోను పిలిపించి ప్రభుత్వ నియమించిన చోట కాకుండా డిప్యూటేషన్ ఎందుకు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్మికుల వేతనాల్లో కోత

- నార్కట్‌పల్లి, చెర్వుగట్టు, ఎల్లారెడ్డి గూడెం జీపీల్లోనే ఈ పరిస్థితి
- కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధిత జీపీ వర్కర్లు
- పరిశీలిస్తానని హామీ ఇచ్చిన కలెక్టర్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నార్కట్‌పల్లి మండల పంచాయతీ సిబ్బంది

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించే గ్రీన్‌ఛానల్ విధానం జిల్లాలోని కొన్ని గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగులకు శాపమైంది. గ్రీన్‌చానల్ విధానంతో వారి వేతనాల్లో కోత పడింది. జిల్లాలోని ప్రధాన మేజర్ గ్రామ పంచాయతీల్లోనే ఈ సమస్య ఏర్పడింది. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ నార్కట్‌పల్లి మండలంలోని నార్కట్‌పల్లి, చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీల బాధిత కార్మికులు ఆందోళనతో సోమవారం కలెక్టర్‌ను ఆశ్రయించారు. తమకు వేతనాల చెల్లింపులో జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ కలెక్టర్‌కు 'ప్రజావాణి'లో వినతి పత్రం అందజేయగా, పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

ఎంపీడబ్ల్యూఎస్‌లుగా రూ.9500 వేతనం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులను మల్టీపర్పస్ (ఎంపీడబ్ల్యూఎస్) వర్కర్లుగా గుర్తించింది. అంటే గ్రామపంచాయతీలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు అవసరమైతే అన్ని రకాల విధులు చేయాల్సి ఉంటుందనేది ఈ కొత్త విధానం ఉద్దేశం. ఇందులో భాగంగా జనాభా ప్రాతిపదికన గ్రామపంచాయతీల్లో ఎంత మంది కార్మికులు, సిబ్బంది ఉండాలో కేడర్ స్ట్రెంథ్ నిర్ణయించి ఆ ప్రకారం వేతనాలను నిర్దేశించారు. ఈ ప్రకారం మేజర్, చిన్న గ్రామ పంచాయతీలు అనే బేధం చూపకుండా అన్నిగ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగులకు రూ.9500 చొప్పున యూనిఫాంగా వేతనం చెల్లించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అన్ని గ్రామపంచాయతీలు సాధారణ నిధుల నుంచి వేతనాలు చెల్లిస్తున్నాయి.

'గ్రీన్‌ఛానల్' ద్వారా వేతనాలు...

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది సెప్టెంబరు నుంచి గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వమే గ్రీన్‌ఛానల్ ద్వారా వేతనాలు ఇస్తుంది. గ్రామపంచాయతీ ఖాతా టీఎస్‌బీపాస్‌లో వేసిన తర్వాత సదరు జీపీ పంచాయతీ కార్యదర్శి ఆ వేతనాలను కార్మికుల వ్యక్తిగత ఖాతాలో జమ చేస్తున్నారు. అయితే రూ.9500 ప్రభుత్వం చెల్లిస్తుండగా కొన్ని మేజర్ గ్రామపంచాయతీలు పాలకవర్గాల తీర్మానం మేరకు పనిభారం ఆధారంగా పెంచిన వేతనాల మిగతా మొత్తాన్ని సాధారణ నిధల ద్వారా చెల్లిస్తున్నారు. అంటే ఉదాహరణకు ఓ మేజర్ గ్రామ పంచాయతీలో ఓ సిబ్బందికి అతని సీనియారిటీని బట్టి రూ.14,500 వేతనం ఉందనుకుందాం. గ్రీన్ చానల్ ద్వారా చెల్లించే రూ.9500 పోను మిగతా రూ.5,000ల వేతనం డబ్బులను జీపీ జనరల్ ఫండ్ నుంచి చెల్లిస్తున్నారు.

వేతనాల్లో 'కోత'లెందుకు..

గ్రామపంచాయతీల్లో 2025 మార్చి వరకు పూర్తి వేతనాలు అందగా, ఆ తదుపరి కొన్ని గ్రామ...

- మిగతా 8వ పేజీలో...

పని భారంతోనే వేతనాల పెంపు



ఎంపీడబ్ల్యూఎస్‌లుగా ప్రభుత్వం కొత్త విధానం ప్రవేశపెట్టి రూ.9500గా వేతనం నిర్ణయించినా జీపీల్లో ఉండే పని భారాన్ని బట్టి పాలకవర్గాలు తీర్మానం చేసి సీనియారిటీ ఆధారంగా వేతనాలను పెంచాయి. ఇందులో భాగంగానే నాకు రూ.14,500వేతనం ఇస్తుండగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రూ.9500 మాత్రమే చెల్లించారు. అంటే ప్రతీ నెలా రూ.5,000 నష్టపోతున్నా. ఎక్కడైనా వేతనం పెంచుతారు, కానీ మాకు మాత్రం వేతనాల్లో కోతపెట్టడం వింతగా ఉంది.
- షకీల్, వాటర్‌మెన్

మొబైల్‌యాప్‌ల పని ఒత్తిడిని తగ్గించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొన్న దేవేందర్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు

నల్లగొండటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ నందు ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న వారు ఆన్‌లైన్ యాప్‌లతో తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, తక్షణమే వాటిని రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాం డ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంలు నిర్వహించిన ధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవటానికి, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏఎన్‌ఎంలు పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా, అనారోగ్యానికి గురైన వారికి చికిత్స అందించేందుకు, చిన్నపిల్లలకు టీకాలు వేయడంలో ఏఎన్‌ఎం పాత్ర కీలకమని అన్నారు. మారుతున్న పరిస్థితుల రీత్యా కొంతకాలంగా ఏఎన్‌ఎంలు చేసే పనులకు సంబంధించిన కొన్ని రిపోర్టులను ఆన్‌లైన్ ద్వారా పం పించాలన్నారు. ఆన్‌లైన్ పనుల నుంచి ఏఎన్‌ఎంలందరికీ మినహాయింపు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కేఎస్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి విశ్వనాధులు లెనిన్, ఏఎన్‌ఎం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. గీతారాణి, కోశాధికారి ఎస్.పద్మ, సరిత, భవాని, శారద, ఎస్.రేణుక, నాగమణి, సిహెచ్. సరిత, హైమావతి, బి.హరిత, ఎం.నిర్మల, శిల్ప, మాధురి, అనిత, సునీత, జ్యోతి, సులోచన, ఎస్.పద్మ, రుక్సానా, అన్నమ్మ, శోభారాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్రిపుల్‌ఆర్ బాధితులకు అండగా ఉంటాం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం.

మునుగోడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (త్రిపుల్‌ఆర్)లో భూములు కోల్పోతున్న రైతులకు అండగా నిలుస్తామని ఎమ్మెల్సీ సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్రిపుల్‌ఆర్‌ను దక్షిణ ప్రాంతంలో అలైన్‌మెంట్ ప్రక్రియను పలుమార్లు మార్చు చౌటుప్పల్ పరిధిలోని ఓ కంపెనీ భూములను కాపాడాలన్న కుట్ర ఫలితమేనని ఆయన స్పష్టం చేశారు. దీంతో అమాయక రైతులు తమ సాగు భూములను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులకు బహిరంగ మార్కెట్ ధరలకు అనుగుణంగా 10రెట్ల ధర చొప్పున లెక్కకట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతులను సమీకరించి ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో యూరియా కొరత నియంత్రించటంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. జిల్లా కేంద్రంలో 10వ తేదీన నిర్వహించనున్న మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని శ్రేణులకు సూచించారు. పార్టీ మండల కార్యవర్గ సభ్యుడు ఉప్పునూతల రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు సురిగి చలపతి, లాలు, గోసుకొండ లింగయ్య, మందుల పాండు, బండమీది యాదయ్య, వెంకన్న, కైలాసం, దుబ్బ వెంకన్న, కాయితం వెంకన్న, సత్తమ్మ, దయాకర్, శంకర్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

మాడ్గులపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. జీఎస్టీని తగ్గించడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులకు కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులవారికి జీఎస్టీ భారం తగ్గుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, విద్యాసాగర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జాన్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, బొమ్మకంటి నరసింహ, నాగరాజు, శ్రీను, సైదులు ఉన్నారు.

21 నుంచి దసరా సెలవులు

రామగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి అక్టోబరు 3 వరకు పాఠశాలలకు దసరా సెలవు ఇస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఈ నెల 28 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు కళాశాలలకు కూడా సెలవులు ప్రకటిస్తున్నామని, విద్యార్థులు గమనించాలని ఆయన కోరారు.

తెరుచుకున్న ఆలయాలు

- సంప్రోక్షణ పూజలు
- 8.15 గంటల నుంచి దర్శనాలు

7



గ్యాస్‌సిలిండర్ పేలి రూ.5లక్షల ఆస్తి నష్టం



మంటల్లో సత్తిబాబు ఇల్లు

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో సోమవారం గ్యాస్‌సిలిండర్ పేలింది. గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సత్తిబాబు ఇంట్లో గ్యాస్‌సిలిండర్ పెద్ద శబ్ధంతో పేలడంతో ఇల్లు కాలిపోయింది. వస్తువులు, బంగారం, వెండి, దుస్తులు, బియ్యం, గడ్డివాము తదితర వస్తువులు బూడిదయ్యాయి. సుమారు రూ.5లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నానని, ఇల్లు మంజూరు చేసి ఆర్థికసహాయం అందించాలని బాధితుడు సత్తిబాబు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ భోగవెల్లి వెంకటరమణచౌదరి సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితుడు సత్తిబాబును ఓదార్చి రూ.50వేల ఆర్థికసహాయం అందించారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బూర, కాసం





బూర నర్సయ్యగౌడ్, కాసం వెంకటేశ్వర్లు

నల్లగొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు బీజేపీ నాయకులకు చోటు దక్కింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, కాసం వెంకటేశ్వర్లును నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందరరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బూర నర్సయ్యగౌడ్ 2014లో భువనగిరి పార్లమెంట్ నుంచి ఎంపీగా గెలుపొందారు. వృత్తిపరంగా వైద్యుడైన నర్సయ్యగౌడ్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో చురుకైనా పాత్రను పోషించారు. అదేవిధంగా మరో ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేశారు. యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ కార్యదర్శిగా, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా పనిచేసిన ఆయనను మరోసారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తీసుకున్నారు.

భువనగిరి టౌన్ : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రానికి చెందిన పట్టణానికి చెందిన న్యాయవాది వేముల అశోక్ బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమితులయ్యారు. అశోక్ గతంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేసి ప్రస్తుతం ఎస్సీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, పాండిచ్చేరి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



ప్రమాద స్థలంలో పల్టీ కొట్టిన కారు

భువనగిరి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి):ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి శివారులోని మాసుకుంట వద్ద ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడెం బాలాజీనగర్‌కు చెందిన చిన్న, అన్సర్‌తో పాటు మరో ఇద్దరు స్నేహితులు రాయిగిరివైపు కారులో వెళ్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో కారు పల్టీ కొట్టింది. కారులోని బెలున్లు తెరుచుకోవడంతో చిన్న, అన్సర్‌లు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో ఇద్దరిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు. కాగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా స్తంభం కిందపడడంతో రాత్రి 11గంటల నుంచి తెల్లవారు జామువరకు మాసుకుంట పరిధిలో విద్యుత్‌సరఫరా నిలిచింది. సోమవారం ఉదయం ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోదాడ రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని గుడిబండ గ్రామశివారులో పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి కోదాడ మున్సిఫ్ కోర్టులో హాజరుపరిచినట్లు కోదాడ రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. గుడిబండ గ్రామానికి చెందిన షేక్ జానీపాషా, షేక్ పాషా, మహ్మద్ జానీ, సుందరబోయిన ఎల్లయ్య, వీరబ్రహ్మం, ఎండీ ఖరీంలు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పేకాటస్థావరాలపై దాడి చేసి రూ.2,200 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నత్తనడకన ఎత్తిపోతల పనులు

● రూ.90 కోట్ల ఏకేబీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు శ్రీకారం
● సీఈసీడీవో అనుమతుల్లో ఆలస్యం ● నిలిచిన రెండు సంప్‌ల పనులు ● మొదలుకాని భూసేకరణ సర్వే

కృష్ణానది పక్కనే పారుతున్నా సాగు నీరు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు గత ప్రభుత్వం రెండు ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని ఎస్సీ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(ఏకేబీఆర్) ఎత్తిపోతల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది మే నెలలో పూర్తి కావాల్సిన పనులు 50 శాతం కూడా పూర్తికాలేదు. ప్రధానంగా గ్రావిటీ ద్వారా చేపట్టాల్సిన పైప్‌లైన్ పనుల సర్వే చేపట్టనే లేదు.

(ఆంధ్రజ్యోతి-పెద్దఅడిశర్లపల్లి)





నిలిచిపోయిన పైప్‌లైన్ నిర్మాణ పనులు, పూర్తయిన పంప్‌హౌస్ గేట్‌వే

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు(ఏఎమ్మార్పీ)లో భాగమైన అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎగువభాగంలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఏకేబీఆర్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. రూ.90 కోట్లతో 6,691 ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుగా అధికారులు ప్రణాళిక సిద్ధంచేశారు. రిజర్వాయర్ నుంచి పైపులైను ద్వారా ఐదు కిలోమీటర్ల దూరంలోని చిలకమర్రి సమీపంలో ఏర్పాటుచేయనున్న మెయిన్ డెలివరీ సిస్టర్న్(సంపు)లోకి తరలిస్తారు. అక్కడి నుంచి నాలుగు విభాగాలుగా 56 కిలోమీటర్ల వరకు పీవీసీ పైపుల ద్వారా నీటిని చెరువులు, కుంటల్లోకి తరలించేలా ప్రణాళికలు రూపొందించారు. ఇందుకు సంబంధించిన పంప్‌హౌస్ పనులు 50శాతం పూర్తి కావొచ్చాయి. పైప్‌లైన్ పనులు సైతం నాలుగు కిలోమీటర్ల మేర పూర్తయ్యింది. మిగిలిన కిలోమీటర్‌కు సంబంధించి రైతలకు నష్టపరిహారం అందకపోవడంతో పనులు నిలిపివేశారు. రైతులకు పరిహారం అందిన వెంటనే సంపు నిర్మాణం, పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

అనుమతుల్లో ఆలస్యం

చిలకమర్రి సమీపంలో ఏర్పాటు చేసే సంప్ నుంచి నాలుగు విభాగాలుగా నీటిని తరలించేందుకు ప్రణాళికలు రూపొందించారు. గ్రావిటీ ద్వారా 56 కిలోమీటర్ల చేపట్టే ఈ పనులకు చీఫ్ ఇంజనీర్ ఫర్ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీఈసీడీవో) నుంచి అనుమతులు రాలేదు. దీంతో భూసర్వే పనులు సైతం ప్రారంభించలేదు. అనుమతులు వచ్చాకే పనులు మొదలుపెడతామని అధికారులు తెలిపారు. ఈ పైప్‌లేన్ల ద్వారా బాలాజీనగర్, పీఏపల్లి, సూరేపల్లి, రోళ్లకళ్లు, చిలకమర్రి, గుర్రంపోడు మండలంలోని 2,100 ఎకరాలకు సాగు నీరు అందనుంది. ఇదిలా ఉండగా రైతులకు నష్టపరిహారం అందించే విషయంలోనూ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. చిలకమర్రి స్టేజీ సమీపంలో మెయిన్ డెలివరీ సిస్టర్న్(సంపు)కు సంబంధించి భూనిర్వాసితురాలు శోభ మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని కోర్టుకు వెళ్లింది. అయితే మహిళా పిటిషన్ కోర్టు తిరస్కరించడంతో రెవెన్యూ అధికారులు ఆ మహిళా రైతు నష్టపరిహారానికి సంబంధించిన చెక్కును రెవెన్యూ యాక్ట్ ద్వారా సంబంధించిన రైతు ఖాతాలో జమచేశారు. అయితే ఇంకా ఆ భూమిని ఇరిగేషన్ అధికారులకు అప్పచెప్పాల్సి ఉంది. ఆ తర్వాతే సంప్ పనులు ప్రారంభమవుతాయని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. అయితే భూమి అప్పగింత రెండు నెలలుగా ఆలస్యం కావడంతో పనులు నిలిచాయి.

సీడీసీపీవో నుంచి అనుమతులు రాలేదు



ఏకేబీఆర్ ఎత్తిపోతలలో భాగంగా చేపట్టిన పంప్‌హౌస్ నిర్మాణం దాదాపు పూర్తయింది. పైప్‌లైన్ పనులు కూడా నాలుగు కిలోమీటర్ల వరకు పూర్తయ్యాయి. సర్జిపుల్ పంప్, మెయిన్ డెలివరీ సిస్టర్(సంప్) డిజైన్లకు సంబంధించి అనుమతులు రాలేదు. సీఈసీడీవో అక్కడి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. రైతులకు పరిహారం కూడా త్వరలోనే అందిస్తాం. రెండు సంప్‌ల పనులు పూర్తయ్యాక గ్రావిటీ పనులకు సంబంధించి సర్వే పనులు ప్రారంభిస్తాం.

నాగయ్య, ఇరిగేషన్ డీఈ

ఎత్తిపోతల పథకాలతో కొత్త ఆయకట్టు

● 1,39,037 ఎకరాలకు సమృద్ధిగా నీరు
● యుద్ధ ప్రాతిపదికన పనుల పూర్తికి ఆదేశాలు
● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లాలో నూతన ఎత్తిపోతల పథకాలతో కొత్తగా 1,39,037ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాల పురోగతిపై సోమవారం సాయంత్రం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. హుజూర్‌నగర్ ప్రాంతంలోని చివరి ఆయకట్టును సస్యశ్యామలం చేసేందుకు ఉద్దేశించిన ఎత్తిపోతలపథకాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ బాధ్యతలు చేపట్టిన ఏజెన్సీలు పనుల పూర్తికి లక్ష్యాలను పెట్టుకుని వేగంగా పూర్తి చేయాలన్నారు. భూసేకరణ విషయంలో కలెక్టర్‌ను భాగస్వామ్యం చేసి సత్వరమే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో నీటిలభ్యత అనుగుణంగా పథకాలను నిర్మించ తలపెట్టామని, అయితే పనుల్లో వేగాన్ని పెంచి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎత్తిపోతల పథకాలు పూర్తయితే హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 82,341 ఎకరాల కొత్త ఆయకట్టు, కోదాడ నియోజకవర్గం పరిధిలో 56,696 ఎకరాల కొత్త ఆయకట్టుకు కలిపి 1,39,037 ఎకరాలకు సమృద్ధిగా నీరు అందుతుందన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని రైతాంగం సాగునీటికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రారంభించిన ప్రాజెక్టుల నిర్మాణం జాప్యం జరుగకుండా చూడాలన్నారు. రైతాంగానికి అండగా నిలబడాలని అధికారులకు, ఏజెన్సీ నిర్వాహకులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. సమావేశంలో ఈఎన్‌సీ అంజద్‌హుస్సేన్, ఈఎన్‌సీ అడ్మినిస్ట్రేషన్ సూర్యాపేట జిల్లా సీఈ రమేష్‌బాబు, ఎస్ఈలు నాగభూషణ్‌రావు, శివధర్మతేజ, ఈఈలు సత్యనారాయణలతో పాటు హుజూర్‌నగర్ ప్రాంతానికి చెందిన నీటిపారుదల శాఖాధికారులు, ఆయా నియోజకవర్గాలకు చెందిన నాయకులు, ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

స్మారక స్థూపావిష్కరణను జయప్రదం చేయాలి

● ఎమ్మెల్యే సామేల్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్, పక్కన ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

శాలిగౌరారం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాలలో ఈ నెల 12న అమరవీరుల స్మారక స్థూపావిష్కరణను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ కోరారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 1948లో వల్లాల గ్రామంలో 10 మంది విద్యార్థులు జాతీయ జెండాను పాఠశాలలో ఎగురవేసినందుకు రజాకార్ల చేతిలో హతమయ్యారన్నారు. వారి స్మారకస్థూపాన్ని మాజీ పీసీసీ అధ్యక్షుడు హనుమంతరావు నిర్మించారని, ఈ స్థూపాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి లక్ష్మణ్ ఆవిష్కరిస్తున్నారని వారు తెలిపారు. ప్రజలు, కార్యకర్తలు అధికసంఖ్యలో విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంఈవో మందుల సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, నరిగే నరసింహ, సింగిల్ విండో చైర్మన్ తాళ్లూరి మురళి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మాజీ సర్పంచ్ షేక్ ఇంతియాజ్ అహ్మద్, భూపతి వెంకన్న, నాయకులు మాదగోని రామలింగయ్య, సైదులు, వేముల గోపినాథ్, కట్టంగూరి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ చట్టాన్ని అమలుచేయాలి



కలెక్టర్ ఇలా త్రిపాఠితో మాట్లాడుతున్న లోడంగి శ్రావణ్‌కుమార్

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కేంద్ర వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టాన్ని చేసి పకడ్బందీగా అమలుచేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లోడంగి శ్రావణ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని సోమవారం సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి రూ.2.70 లక్షల కోట్లు కేటాయించి ఏడాదిలో 200 రోజులు పనులు కల్పించాలన్నారు. అదేవిధంగా రోజుకు కనీసం రూ.700కూలి ఇవ్వాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు పబ్బు వీరాస్వామి, నాయకులు సుజాత, విజయ, దోటి పండరి, మహేందర్, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో యూరియా అందజేయాలి



మన గ్రోమోర్ వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు వర్షిత్‌రెడ్డి, రైతులు

తిప్పర్తి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సకాలంలో యూరియా అందజేయాలని బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తిప్పర్తి మండలకేంద్రంలోని మన గ్రోమోర్, రైతు ఆగ్రోస్ కేంద్రాల వద్ద రైతులు పెద్దసంఖ్యలో బారులు తీరడంతో 200 బస్తాల యూరియాను ఇచ్చిన దుకాణాదారులు ఆ తర్వాత బంద్ చేశారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న బీజేపీ నాయకులు రైతులకు మద్దతు తెలుపుతూ యూరియా కొరతను ప్రభుత్వం తీర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులతో కలిసి దుకాణ సముదాయల వద్ద నిరసన తెలిపి, తిప్పర్తి-మిర్యాలగూడ రోడ్డుపై రాస్తారోకో చేశారు. కొద్దిసేపటి తర్వాత ఆందోళన విరమించారు. కార్యక్రమంలో వీరెల్లి చంద్రశేఖర్, గోలి మధుసూదన్‌రెడ్డి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, తిప్పర్తి మండల బీజేపీ అధ్యక్షుడు వంగూరి రవి, పీ నరేందర్‌రెడ్డి, గంగాధర్, నేతునూరి శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, నవీన్, యాదయ్య, లక్ష్మయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీ గెట్‌లో ఎంవీఎన్ ట్రస్ట్ విద్యార్థుల ప్రతిభ

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో ఎకనామిక్స్ ఫోరం విభాగంలో ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులు పీజీకోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన సీపీగెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ట్రస్ట్ కన్వీనర్, ఫోరం అధ్యక్షుడు అక్కెనపల్లి మీనయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్ట్‌లో 40 రోజులు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించి, కంప్యూటర్ బేస్డ్ పరీక్షలతో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మొదటి మూడు ర్యాంకులతో పాటు 27వ ర్యాంకులను పొందారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నంద్యాల నర్సింహారెడ్డి, కోశాధికారి జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, విజ్ఞాన కేంద్ర కార్యనిర్వహణ కార్యదర్శి పుచ్చకాయల నర్సిరెడ్డిలు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మఠంపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో దినసరి మహిళా కూలీ మృతి చెందింది. ఈ సంఘటన సోమవారం రాత్రి సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తదొనబండతండాకు చెందిన బానోతు మంగతి(52) దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. రోజువారి పనిలో భాగంగా సోమవారం ఆటోలో హుజూర్‌నగర్ అడ్డా మీద పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసిద్ధమైంది. సమీప బంధువు పాలకవీడు మండలం దేవ్లాతండాకు చెందిన మాలోతు సైదా మఠంపల్లి మీదుగా ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండటంతో ఆయనతో పాటు బయలుదేరింది. చౌటపల్లి గ్రామ సమీపంలోని లక్ష్మీనృసింహ ఫంక్షన్‌హాల్‌కు వెళ్లే రహదారి వద్ద ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సైదా బైక్‌పై కూర్చున్న మంగతి కిందపడగా వెనకాలే వస్తున్న లారీ ఆమె నడుము పైనుంచి వెళ్లింది. దీంతో మంగతి శరీరభాగాలు నుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. సైదాకు తీవ్ర గాయాలయ్యాయి. మంగతికి భర్త సక్రు పదేళ్ల కిందట చనిపోగా ఒక కుమారుడు ఉన్నారు. తీవ్ర గాయాలైన సైదాను కుటుంబసభ్యులు మిర్యాలగూడకు తరలించారు. మంగతి మృతితో కొత్తదొనబండతండాలో విషాదాఛాయలు అలుముకున్నాయి.

40 గోవుల పట్టివేత

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా డీసీఎంలో గోవులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మధకుమార్‌తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట నుంచి హైదరాబాద్ కబేళాకు డీసీఎంలో 40గోవులను తరలిస్తుండగా చౌటుప్పల్‌లో పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్లు ఇస్మాయిల్ , ఎండి సిరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

కల్వర్టు తెగి 20 రోజులైనా నిర్లక్ష్యం



బూరుగడ్డ పెద్దచెరువు ప్రాంతంలో తెగిన కల్వర్టు (ఫైల్)

» ఇబ్బందులు పడుతున్న రైతులు
» ఎగువన 1000 ఎకరాల్లో సాగు

భారీ వర్షాలతో తలెత్తిన వరదలకు కల్వర్టులు, రోడ్లు, బ్రిడ్జిలు తెగిపోతున్నాయి. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలోని పెద్దచెరువు కింద కల్వర్టు 20 రోజుల కిందటే అలుగు వరదకు కల్వర్టు కొట్టుకుపోయింది. కల్వర్టుకు ఎగువన 1000 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. వారు పొలాలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అయినా పట్టించుకున్న నాథుడే లేడు.

- (ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

ఇటీవలి వర్షాల వరదలకు హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామపరిధిలోని పెద్దచెరువు అలుగుపోసింది. రెండు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నీటిప్రవాహం పెద్దఎత్తున రావడంతో అలుగు కింది భాగంలో ఉన్న బూరుగడ్డ-రాయినిగూడెం మార్గంలో పంటపొలాలకు వెళ్లే కల్వర్టు తెగిపోయింది. దీంతో రాకపోకలు నిలిచి పొలాలకు వెళ్లేందుకు రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈ కల్వర్టు పైభాగంలో సుమారు 1000 ఎకరాలకు పైగా పొలాలు సాగులో ఉన్నాయి. పెద్దచెరువు పక్కన లోలెవెల్ వంతెన 500 మీటర్ల మేరకు ఉండగా భారీ వరదకు బ్రిడ్జి పక్కన కట్ట కోతకు గురైంది. ఇదిలా ఉండగా బ్రిడ్జి సైతం పూర్తిగా దెబ్బతింది. దీంతో రైతులు బ్రిడ్జిపై నుంచి వెళ్లాలంటే తీవ్రఇబ్బందులు పడుతున్నారు.

శిఖం ఆక్రమణలతోనే...

బూరుగడ్డ పెద్దచెరువు 130 సర్వే నెంబర్‌లో 140 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువును బూరుగడ్డకు చెందిన భూస్వాములు, బడా రైతులు 30 ఏళ్లుగా ఆక్రమిస్తూ వస్తున్నారు. 140 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువు ప్రస్తుతం 50 ఎకరాల మేరకే ఉందని మత్స్యకార్మిక సంఘాల నాయకులు తెలిపారు. బూరుగడ్డలోని పెద్దచెరువు ప్రాంతంలో ఎకరం రూ.50 లక్షల మేరకు ఉండడంతో రైతులు భూములు ఆక్రమించి దొంగ పట్టాలు సృష్టించారని మత్స్యకార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఒక్కో భూస్వామి 5 నుంచి 10 ఎకరాలపైనే చెరువు శిఖం భూములు కబ్జాచేసి పట్టాలు పొందినట్లు ఆరోపిస్తున్నారు. కాగా చెరువు ఆనవాళ్లు కోల్పోతున్న నేపథ్యంలో రెండేళ్లుగా మత్స్యకార్మికులు బూరుగడ్డ పెద్దచెరువులో చేపలు పోయడంలేదు. చెరువు విస్తీర్ణం కుంచించుకుపోవడం, ఇటీవలి భారీ వర్షాలకు అలుగు పోస్తుండగా సమీపంలోని లోలెవెల్‌లో గూనలతో నిర్మించిన కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఆక్రమణకు గురైన చెరువు శిఖం భూములను విడిపించి అక్రమ పట్టాలను రద్దు చేయడంతో పాటు కల్వర్టును త్వరగా నిర్మించాలని మత్స్యకార్మిక సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు, బూరుగడ్డ గ్రామస్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలి



బూరుగడ్డ పెద్దచెరువు వద్ద ప్రభుత్వం వెంటనే హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు కింది భాగంలోని కల్వర్టు, రోడ్డు కొట్టుకుపోయింది. రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్రఇబ్బందులు పడుతున్నారు.

- మాడుగుల పరశురామ్

గుంతలు ఇలా, వెళ్లేది ఎలా..

(ఆంధ్రజ్యోతి-పెన్‌పహాడ్): భారీ వర్షాలకు పెన్‌పహాడ్ మండలంలో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇటీవలి వర్షాలకు జానారెడ్డినగర్ నుంచి పెన్‌పహాడ్ మండలకేంద్రం మీదుగా దూపాడు వరకు ఉన్న తారు రోడ్డుపై పెద్దగుంతలు పడ్డాయి. ఈ రహదారి మీదుగానే నేరేడుచర్ల నుంచి మిర్యాలగూడ వెళ్లేందుకు ఆర్టీసీ సర్వీసులు రాకపోకలు కొనసాగిస్తాయి. ఈ రహదారిపై కొత్తవారు ఆదమరిచి వాహనం ఇబ్బందులు తప్పవు. మండలంలోని అన్ని లింక్ రోడ్లు బురద గుంతలతో దర్శనమిస్తున్నాయి.



వర్షాలకు పొట్లపహాడ్‌కు వెళ్లే మార్గంలో నిలిచిన నీరు

చినుకు పడితే చిత్తడే...

(ఆంధ్రజ్యోతి-మునగాల రూరల్) :మునగాల మండలం రేపాల గ్రామంలో రహదారి అధ్వానంగా తయారైంది. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో రాకపోకలకు కష్టంగా మారింది. వర్షాలకు రోడ్డుపై నీళ్లు నిలిచి సముద్రాన్ని తలపిస్తోంది. రెండు అడుగుల లోతు గుంతలు ఉండటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆ రోడ్డుపై ప్రయాణమంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోవాల్సి వస్తోంది. రహదారికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రేపాలలో వీధుల్లో నిలిచిన వర్షపు నీరు

ఆశతో వచ్చి.. నిరాశగా వెనుదిరిగి

● యూరియా కోసం కష్టాలు.. పొద్దంతా పడిగాపులు ● పీఏసీఎస్‌ల వద్ద బారులు ● పోలీస్ పహారాలో యూరియా పంపిణీ ● ఉమ్మడి జిల్లాలో రైతుల అవస్థలు

యూరియా కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. పీఏసీఎస్‌ల వద్ద తెల్లవారుజాము నుంచే బారులు తీరుతున్నారు. పనులు మానుకొని బస్తా యూరియా కోసం పరుగులు పెడుతున్నారు. చెప్పులు, పాస్‌పుస్తకాలను క్యూలైన్లలో పెట్టి ఎదురుచూస్తున్నారు. చాలాచోట్ల యూరియా రాకపోవడంతో ఆందోళన చేశారు. పోలీసులు, వ్యవసాయాధికారులు నచ్చజెప్పి రైతులతో ఆందోళనలు విరమింపజేయించారు. కొన్నిచోట్ల పోలీసుల పహారాలో యూరియా పంపిణీ చేశారు. ఆశగా వచ్చి సొసైటీ ఎదుట గంటల పాటు తరబడి పడిగాపులు కాసినా యూరియా దొరకకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

అర్వపల్లి, మద్దిరాల, నూతనకల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా అర్వపల్లి, తిమ్మాపురం గ్రామాల పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరారు. రైతులకు సరిపడా యూరియా అందజేయాలని సీపీఎం మండల కార్యదర్శి వజ్జె కార్యదర్శి, న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు పోలేబోయిన కిరణ్ డిమాండ్ చేశారు. నూతనకల్ మండలకేంద్రంలోని మన గ్రోమోర్ కేంద్రానికి యూరియా ఉమ్మడి నూతనకల్ మండలం నుంచి సుమారు వెయ్యి మంది రైతులు వచ్చారు. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది. ఎస్ఐ రావుల నాగరాజు అక్కడికి చేరుకొని రైతులందరినీ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఆయనే స్వయంగా టోకెన్లు పంపిణీ చేశారు. వారంరోజుల్లో యూరియా వస్తుందని ఎస్ఐ రైతులకు నచ్చ జెప్పారు. మద్దిరాలలో ఆగ్రోస్ కేంద్రం, ఎన్‌డీసీ కార్యాలయాల వద్ద రైతులు పడి గాపులు కాశారు. యూరియా వచ్చిందనే సమాచారం తెలుసుకున్న రైతులు ఒక్కసారిగా కేంద్రాలకు రావడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.


సూర్యాపేటలో పోలీసుల పహారాలో రైతులకు రశీదులు అందిస్తున్న వ్యవసాయ అధికారి సందీప్

గంటల కొద్దీ క్యూలైన్‌లో ఉండే పరిస్థితి నెలకొంది. దీంతో పీఏసీఎస్‌ల వద్ద యూరియా దొరకడం లేదని నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నిద్రాహారాలు మాని తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే యూరియా కోసం పడిగాపులు కాస్తున్నా మని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట వేసి నెల రోజులు కావొస్తున్నా యూరియా వేయకపోవడంతో పంటలకు నష్టం జరిగే ప్రమాదం నెలకొందని, యూరియా వేస్తేనే పైరు ఎదిగి దుబ్బు కడితేనే దిగుబడి వస్తుందని తెలిపారు. వందల సంఖ్యలో రైతులు వస్తే సగం మందికి కూడా దొరకడంలేదన్నారు. దీంతో కొందరు రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

మన గ్రోమోర్ వద్ద కిక్కిరిసిన రైతులు

భానుపురి: సూర్యాపేట పట్టణంలోని మన గ్రోమోర్‌కు సోమవారం 1200 బస్తాల యూరియా వచ్చింది. సూర్యాపేట మండల రైతులతో పాటు ఇతర గ్రామాల నుంచి రైతులు తరలివచ్చారు. యూరియా వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు ఉదయం నుంచే వరుసలో ఉన్నారు. దీంతో పోలీసుల పర్యవేక్షణలో ఒక్కో రైతును గ్రోమోర్ కార్యాలయంలోకి పంపి రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. సూర్యాపేట ఏవో సందీప్, ఏఈవో ముత్తయ్యలు రైతుల వివరాలను ఆధార్‌కార్డు, పట్టా పాస్‌పుస్తకం జిరాక్స్‌ల ఆధారంగా యూరియా పంపిణీ చేశారు.

పనులు మాని పీఏసీఎస్‌లకు పరుగులు

మఠంపల్లి: యూరియా కోసం రైతులు వ్యవసాయ పనులు మాని రోజుల తరబడి తిరుగుతున్నారు.


మఠంపల్లి పీఎస్‌సీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

యూరియా కోసం ఇబ్బందులు



తుంగతుర్తి పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు

తుంగతుర్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు అవస్థలు పడక తప్పడంలేదు. సరైన సమయంలో రైతులకు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం తుంగతుర్తి సొసైటీకి యూరియా వస్తుందని తెలియడంతో వేకువజాము నుంచి రైతులు తుంగతుర్తిలోని రైతు సేవా సహకార సంఘం చేరుకొని క్యూలో నిలుచున్నారు. కొందరు రైతులు తమ పనులను వదులుకొని వేచి ఉంటున్నారు. ప్రభుత్వం రైతుల కోసం యూరియాను తెప్పించి అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

మేళ్లచెర్వు: తోపులాటలు జరగకుండా, రైతులకు ఎండ తగలకుండా సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు పీఏసీఎస్ సిబ్బంది టెంట్లు ఏర్పాటుచేశారు. సోమవారం మండలకేంద్రానికి 400బస్తాల యూరియా వచ్చిందని సమాచారంతో రైతులు భారీగా చేరుకున్నారు. మొదట లైన్లో ఉన్న 200మంది రైతులకు ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియా అందడంతో ఉదయం నుంచి క్యూలైన్‌లో వేచి ఉన్న రైతులు నిరాశతో వెనుదిరిగారు.

చిలుకూరు: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. పీఏసీఎస్‌కు సోమవారం యూరియా కట్టలు వచ్చాయి. దీంతో యూరియా కట్టా కోసం రైతులు బారులు తీరారు. ఉదయం ఆరు గంటలకే పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను క్యూలో పెట్టారు. గంటల తరబడి రైతులు నిలబడితే కట్ట యూరియా లభించిందని రైతులు వాపోతున్నారు. యూరియా కష్టాలు తీర్చాలని రైతులు కోరుతున్నారు.

యూరియా అధిక ధరకు విక్రయాలు

కోదాడరూరల్: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని ఎర్రవరం, కోదాడ, చిమిర్యాల, కాపుగల్లు రైతులకు యూరియా అందక రైతులు అవస్థలు పడుతున్నారు. సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు యూరియా వేయకపోవడంతో పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బయట మార్కెట్లో యూరియా బస్తా రూ.450లకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపించారు.


సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో రైతుల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు, బారికేడ్లు

యూరియా పక్కదారి పడుతోందని ఆందోళన


మోతె గ్రోమోర్ దుకాణం వద్ద బారులుతీరిన రైతులు

మోతె: సూర్యాపేట జిల్లా మండలకేంద్రంలోని గ్రోమోర్‌కు, సర్వారం సొసైటీకి యూరియా బస్తాలు రావడంతో మండల పరిధిలో ఉన్న గ్రామాల రైతులు ఉదయం ఎనిమిది గంటలకే గ్రోమోర్ ఎదుట నాలుగు వరుసల క్యూ కట్టారు. దుకాణం తెరవక ముందే వందల సంఖ్యలో రైతులు రావడంతో యూరియాను పంపిణీ చేయలేమని గ్రోమోర్, సర్వారం సొసైటీ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేస్తుండడంతో రైతులు పెరగడంతో నిలవరించలేకపోయారు. సూర్యాపేట నుంచి కొంత మంది పోలీసులు వచ్చారు. గ్రోమోర్‌కు 400బస్తాల యూరియా రావడంతో వెయ్యి మంది పైబడి రైతులు లైన్‌లో ఉన్నారు. సర్వారం సొసైటీకి 200బస్తాల యూరియా వచ్చింది. 700మంది రైతులు క్యూలైన్‌లో ఉన్నారు. పంపిణీలో ఇబ్బందులకు గురిచేయడంతో పాటు పరపతిఉన్న వారికి గ్రోమోర్ సిబ్బంది గుట్టుగా పంపిణీ చేస్తున్నారని రైతులు తిరగబడ్డారు. సర్వారం సొసైటీలో లైన్‌లో మహిళలు ఎక్కువగా ఉండడంతో తొక్కిసలాటలో నేరేడువాయి తండాకు చెందిన బుజ్జి అనే మహిళా రైతు సొమ్మసిల్లి పడిపోయింది.

పోలీస్ పహారాలో యూరియా పంపిణీ

పెద్దఅడిశర్లపల్లి: నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలకేంద్రంలోని సింగిల్‌విండో, అంగడిపేట ఎక్స్‌రోడ్డు మన గ్రోమోర్ వద్ద రైతులు బారులు తీరారు. తొలత చెప్పులు క్యూలైన్లో పెట్టిన రైతులు క్యూ కట్టకుండా ఒకేసారి తోసుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకొని యూరియా పంపిణీ చేశారు.

మర్రిగూడ: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలకేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్, లెంకలపల్లి గ్రామంలో శివన్నగూడ వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో రైతులు ఉదయం ఏడు గంటలకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. తోపులాట జరగడంతో పోలీసులు వచ్చి పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు ద్వారా ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియా పంపిణీ చేశారు.

యాదాద్రిభువనగిరి జిల్లాలో..

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలానికి సోమవారం మోత్కూరు మండలంలోని వివిధ దుకాణాలకు 1700 బస్తాల యూరియా వచ్చింది. మోత్కూరు సింగిల్ విండోకు 444, మన గ్రోమోర్‌కు 444, శ్రీరామ ఫర్టిలైజర్స్‌కు 150, బాలాజీ ఫర్టిలైజర్స్‌కు 150, లక్ష్మీనర్సింహ ఫర్టిలైజర్స్‌కు 70, పాటిమట్ల మన గ్రోమోర్‌కు 444 యూరియా బస్తాలు వచ్చాయి. విషయం తెలుసుకున్న రైతులు దుకాణాలకు పరుగులు తీశారు. గొడవలు జరగకుండా పోలీసుల పహారాలో యూరియా పంపిణీ చేశారు.



మోత్కూరులోని మనగ్రోమోర్ దుకాణం వద్ద గుమిగూడిన రైతులు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నల్లగొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంజీయూ ఉపకులపతి అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. సోమవారం ఎంజీయూలో క్రీడలను ప్రారంభించారు. దేహదారుఢ్యం మానసికోల్లాసం పెంపొందించడానికి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల్ రవి, ప్రశాంతి, మద్దిలేటి మురళి, శ్రీనివాస్ రెడ్డి, శివశంకర్, హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

14 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నాగార్జునసాగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు 14 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 589.20 అడుగులుగా (309.6546టీఎంసీలు) నమోదైంది. కుడి కాల్వ ద్వారా 9,700క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 9,166 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,658 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, 14గేట్ల నుంచి 1,12,224 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 1,67,448 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా, ఎగువనుంచి 1,67,448 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

మూసీకి నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. ఎగువ నుంచి 1280.99 ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు 8నెంబరు క్రస్టుగేటును అడుగు మేర ఎత్తి 645.13 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టి ఇన్‌ఫ్లో నిలకడగా వస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టు నీటిమట్టాన్ని 643.50అడుగులు(4.07 టీఎంసీ)ల దిగువకు పడిపోకుండా చూస్తూ అదనపు నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 575.64క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.50అడుగులు(4.07టీఎంసీ)లుగా ఉంది.

రాష్ట్రస్థాయి స్కిప్పింగ్ పోటీల్లో బంగారు పతకం

హుజూర్‌నగర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని మాధవరాయనిగూడేనికి చెందిన కన్నెగంటి భార్గవచారి రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో మొదటి బహుమతి సాధించాడు. ఆదివారం ఘట్కేసర్‌లో ఆచార్య స్పోర్ట్స్ అకాడమిలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించిన భార్గవ్‌కు నిర్వాహకులు గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. అక్టోబరు 25 నుంచి 28 వరకు ముంబైలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో భార్గవచారి పాల్గొననున్నట్లు రాష్ట్ర స్కిప్పింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. నరేష్, సెక్రటరి శ్రీధర్‌పటేల్, కోశాధికారి దాయాది శ్రీనివాస్ తెలిపారు.

తెరుచుకున్న ఆలయాలు

● యాదగిరిగుట్ట ఆలయ మాడవీధుల సంప్రోక్షణ ● ఉదయం 8.15 గంటలకు సర్వ దర్శనాలకు అనుమతి


యాదగిరిగుట్ట ఆలయ తిరువీధులు మంగళవాయిద్యాలతో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం తర్వాత యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం, పాతగుట్ట, శివాలయాలను సోమవారం వేకువజామున తెరిచారు. ప్రధానాలయం, ఉప, అనుబంధ ఆలయాలను 3.30గంటలకు తెరిచిన ఆలయ అధికారులు ఉదయం ఐదు గంటల వరకు శుభ్రం చేశారు. అనంతరం ఆలయం, మాడవీధుల్లో ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ అర్చకులు సంప్రోక్షణ చేపట్టారు. సుమారు 14 గంటల (ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మూసిన ఆలయాన్ని సోమవారం వేకువజామున 3.30గంటలకు తెరిచారు) తర్వాత నిత్య పూజలు ప్రారంభమయ్యాయి. మూల మంత్ర హోమం జరిపి నవకలశస్నపనం అనంతరం స్వామివారి నిజాభిషేకం నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, బిందె తీర్థం, తిరువారాధన, బాలభోగం, నిజాభిషేకం అనంతరం నిత్య కైంకర్యాలు యథావిధిగా కొనసాగాయి. ఉదయం 8.15గంటలకు భక్తులను సర్వదర్శనాలకు అనుమతించారు. కొండకింద వ్రత మండపాల్లోనూ వ్రతాలు, వాహన పూజలు పునఃప్రారంభించారు. గ్రహణం సందర్భంగా ఆదివారం సాయంత్రం రద్దు చేసిన స్వామివారి ఊరేగింపు సేవలు, అర్చన, ఆరాధన, శయనోత్సవం ఆలయ ప్రధానార్చక బృందం చేపట్టింది.


శివకేశవులకు విశేష పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. సంపూర్ణ చంద్రగ్రహణం అనంతరం వేకువజామున ప్రధానాలయంలో స్వయంభు స్వామిఅమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు.

మట్టపల్లిలో దర్శనాలు ప్రారంభం

మఠంపల్లి: సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మూసివేశారు. చంద్రగ్రహణం ముగియడంతో సోమవారం తెల్లవారుజామున దేవాలయ సిబ్బంది ఆలయాన్ని కృష్ణాజలాలతో ఆలయాన్ని సంప్రోక్షణ చేశారు. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసిన అనంతరం భక్తుల దర్శనాలు కొనసాగాయి. మంగళవారం కూడా అర్జిత సేవలు నిలిపివేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ తెలిపారు.

ఆలయ ఆవరణలోకి కొనసాగుతున్న ఊట


ఆలయంలోకి వచ్చిన నీటిని బయటకు తోడేస్తున్న మోటార్లు

మఠంపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని స్వయంభు మట్టపల్లి లక్ష్మీనరసింహుడి ఆలయ కరకట్ట లీకేజీ ద్వారా వరదనీరు వస్తోంది. ఎగువ నుంచి కృష్ణానదికి వరద నీటితోపాటు సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో మట్టపల్లి వద్ద కృష్ణానది ఉధృతంగానే ప్రవహిస్తోంది. పులిచింతల ప్రాజెక్టులో 45 టీఎంసీల నీటి నిల్వతో బ్యాక్ వాటర్ ద్వారా కృష్ణానది తీర ప్రాంతంలోని మట్టపల్లి ఆలయం వద్ద ప్రహ్లాద స్నానఘాట్, మార్కండేయ పుష్కరఘాట్ పూర్తిగా మునిగిపో యాయి. ఆలయం వద్ద నిర్మించిన రక్షణ కరకట్ట ద్వారా లీకేజీతో కొంతమేర వరదనీరు వస్తోంది. కరకట్ట పొడవునా సుమారు 15చోట్ల లీకేజీ ద్వారా అడుగు మేర నీరు ఆలయ అవరణలోకి చేరుతోంది. సోమవారం ఆలయ ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ పరిశీలించారు. లీకేజీ ద్వారా వస్తున్న వరద నీటిని రెండు 15హెచ్‌పీ మోటార్ల ద్వారా తోడేస్తున్నారు. వరదనీటిని రెండు గంటలకోసారి బయటికి తోడుతున్నారు. ఇంకో ఆరు అడుగుల వరద ప్రవాహం పెరిగితే కరకట్ట లీకేజీ ద్వారా ఆలయంలోకి వరద నీరు భారీగా వచ్చే ప్రమాదముంది. కరకట్ట లీకేజీ ద్వారా వరదనీరు ఆలయంలో రాకుండా శశ్వాత పరిష్కారం చూపాలని భక్తులు కోరుతున్నారు.

పశువుల్లో లంపి వ్యాధి కలకలం

● వైరస్‌తో మృత్యువాతపడుతున్న దూడలు ● రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యుల సూచన

డిండి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పశువుల్లో లంపి చర్మ వ్యాధి కలవర పెడుతోంది. దూడలపై వైరస్ తీవ్ర ప్రభావం చూపి మృత్యువాతపడుతున్నాయి. పశువులు మేత మేయకపోవడం, నీరసంగా ఉండడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలు కనిపించడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. లంపి అనే వైరస్ వల్ల పశువులకు సోకే వ్యాధిగా వైద్యులు నిర్ధారించారు. అంటు వ్యాధి కావడంతో ఈ వ్యాధి ఒక పశువు నుంచి మరో పశువుకు వ్యాధి వ్యాపిస్తుంది. గాలి, నీరు, ఆహారం ద్వారా కూడా పశువులు ఈ వ్యాధి బారిన పడుతున్నాయి. దూడల్లో దీని ప్రభావం 75శాతం ఎక్కువగా ఉంటుందని పశువైద్యులు చెబుతున్నారు. నల్లగొండ జిల్లా డిండి సరిహద్దులోని నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలంలో వ్యాధి అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. వ్యాధి సోకిన పశువులతో ఆరోగ్యంగా ఉన్న పశువులు కలవడం వల్ల నల్లగొండ జిల్లా డిండి మండలానికి ఈ వ్యాధి విస్తరించింది.



వ్యాధి లక్షణాలు

లంపి చర్మ వ్యాధి అంటు వ్యాధి. పశువులకు దోమలు, ఈగలు, పేళ్ల ద్వారా వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన పశువుల లాలాజలం ముక్కు ద్వారా వచ్చే నీరు, పాలు, వీర్యం ద్వారా మరో పశువుకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధి పెద్ద పశువుల్లో మోస్తరుగా దూడల్లో తీవ్రం గా ప్రభావం చూపుతుంది. వ్యాధి సోకిన పశువులకు జ్వరం 104 నుంచి 107 డిగ్రీల వరకు ఉంటుంది. మేత తినేందుకు ఇష్టపడవు. నొప్పులు ఉండి పశువులు నీరసంగా ఉంటాయి. కళ్లు, నోటి నుంచి నీరు కారడం, పాల దిగుబడి, బరువు తగ్గడం వంటి లక్షణాలుంటాయి. దీంతోపాటు బొబ్బలు, దద్దుర్లు(బెందులు), కణితుల రూపంలో చర్మం, మూతి, నాసిక రంధ్రాలు, తల, మెడ భాగం, వీపుమీద, కాళ్ల వద్ద, పొదుగు భాగం, కనుబొమ్మల మీద కనిపిస్తాయి. ఈ కణతులు అంతర్గత అవయవాలకు కూడా ఏర్పడుతాయి. ముఖ్యంగా ఊపిరితిత్తుల్లో కూడా ఏర్పడి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి దూడలు చనిపోతాయి. ఈ వైరస్ వల్ల ఏర్పడిన దద్దుర్లు తెల్లని మచ్చగా ఏర్పడి తరువాత చీముపట్టి పశువుల లోపలి భాగాన్ని తింటాయి. ఈ సమయంలో వైద్యం అందకుంటే పశువులు మృత్యువాతపడతాయి.

తీసుకోవలసిన జాగ్రత్తలు

పశువులను రోజూ గమనిస్తుండాలి. ముఖ్యంగా చర్మంపై దద్దుర్లు, నల్లమచ్చలు, కణతులు ఉన్నాయోలేదో చూడాలి. వ్యాధి సోకిన పశువులను, ఇతర పశువులను కలవకుండా దూరంగా ఉంచాలి. పశువుల దొడ్డిలో ఈగలు, దోమలు, పేలు, లేకుండా జాగ్రత్త వహించాలి. వీటి నివారణకు పశువుల పాకలో తరచుగా వేప ఆకులతో పొగపెట్టాలి. వీలైతే దోమతెరలు కట్టాలి. వ్యాధి లక్షణాలు కనపడిన పశువులను మంద నుంచి వేరు చేసి 10 నుంచి 15 రోజులపాటు ప్రత్యేకంగా ఆహారం అందించాలి. దగ్గరల్లో ఉన్న పశువైద్యులను సంప్రదించి చికిత్స చేయించాలి. వ్యాధి తీవ్రత లేగదూడల్లో ఎక్కువగా ఉంటుంది. లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా పశువైద్యుడిని సంప్రదించాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న వైరస్ ఉధృతి పెరుగుతుంది. కొబ్బరి నీళ్లు, అంబలి వంటి ద్రావకాలను కొన్ని రోజులపాటు వ్యాధి సోకిన పశువులకు అందించాలని పశు వైద్యులు సూచిస్తున్నారు.

పశువులకు సోకే లంపి వ్యాధికి టీకాలు లేవు



లంపి వ్యాధికి టీకాలు, వైద్యం లేదు. తాత్కాలిక ఉపశమనం కోసం గోట్‌పాక్స్ టీకాలు వేస్తుంటారు. ఈ టీకా వేసిన వాటికి కూడా లంపి వ్యాధి సోకింది. ఈ వ్యాధి సోకిన లేగదూడలను గుర్తించి పశువైద్యులను సంప్రదించి వైద్యం అందించాలి. లేదంటే వ్యాధి ప్రభావం చేత పశువులు చనిపోయే ప్రమాదముంది.

● పశువైద్యాధికారి నాగయ్య, కొండమల్లేపల్లి.

చిట్యాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

చిట్యాల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిట్యాల పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అరూరి ప్రణీత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ కళాశాల లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శశికుమార్, రాము, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

గట్టుప్పల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృతి పవిత్రమైనది మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం అన్నారు. మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన సభకు ఆయన హాజరయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో అమృతాదేవి, నాయకులు జగన్నాథం, శ్రీశైలంగౌడ్, శ్రీనివాస్, రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నాం..ఆదుకోండి

'ప్రజావాణి'కి వినతుల వెల్లువ

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్య ల పరిష్కారానికి వారం వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వినతులు వెలువెత్తాయి. కొందరు వ్యక్తిగత సమస్యలపై తరలిరాగా మరికొందరు సా మాజిక అంశాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వాటిలో కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే కొన్నింటిని పరిష్కరించారు. మరికొన్నింటి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు లేఖలు రాశారు.


ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ఉపాధి అవకాశం కల్పించండి



మేము టీజీ జెన్‌కో ఎన్ఎస్‌టీడీ నిర్మాణంలో భూములను కోల్పోయాం. భూములను కోల్పోయిన సమయంలో తమకు కుటుంబంలో ఒకరికి టెయిల్‌పాంట్‌లో ఉద్యోగం కల్పిస్తానని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చారు. అర్హులైన వారందరం దరఖాస్తు చేసుకున్నాం. అయినా ఇప్పటి వరకు ఎలాంటి ఉద్యోగం రాకపోగా ఆర్థికంగా కూడా సాయం అందలేదు. భూములు కోల్పోయిన తాము ప్రస్తుతం దీనస్థితిలో ఉన్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయపరంగా టీజీ జెన్‌కోలో ఉద్యోగ అవకాశం కల్పించి అన్నివిధాలా ఆదుకోవాలి.

- చింతలపాలెం గ్రామస్థులు, అడవిదేవులపల్లి

ఆక్రమదారులపై చర్యలు తీసుకోవాలి



గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గల ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించుకొని ఆ స్థలంలో షాపులు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో గొడవలు జరగకుండా ఉండాలంటే ఆక్రమణకు గురైన స్థలాన్ని వెంటనే గ్రామపంచాయతీ స్వాధీనం చేసుకోవాలి. అక్కడ నిర్మించిన షాపులను తొలగించాలి. అప్పుడే గ్రామంలో ఎలాంటి ఘర్షణలకు తావు ఉండదు. అధికారులు ఇప్పటికైనా నిజనిజాలు పరిశీలించాలి.

- సీహెచ్. వెంకన్న, కన్నెకల్, మాడ్గులపల్లి

బిల్లు ఇప్పించండి



నేను చిన్న చిన్న కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ ఉండేవాడిని. మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడలోని షాబ్‌నగర్‌లో నిర్మాణ పనులు కాంట్రాక్ట్ పద్ధతిన నిర్వహించాను. పనులు పూర్తయి రెండేళ్లవుతున్నా ఇప్పటివరకు బిల్లులు మంజూరు కాలేదు. అప్పులు తెచ్చి నిర్మాణ పనులను చేపట్టాను. అనేక సార్లు బిల్లులు ఇప్పించాలని అధికారుల చుట్టూ తిరిగినా ఎలాంటి ఫలితం లేదు. దయచేసి బిల్లులు మంజూరు చేసి ఆదుకోండి.

- లింగయ్య, ఐలాపురం, మిర్యాలగూడ

వైభవంగా పునీత మరియమాత వేడుకలు

కేతేపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల ఆరాధ్య దైవం పునీత మరియ మాత జన్మదిన వేడుకలను సోమవారం మండలంలోని ఇనుపాముల ఆర్సీఎం చర్చిలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరై మరియమాతకు కొవ్వొత్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కల్యాణార్థం ఏసుక్రీస్తుకు జన్మనిచ్చిన మరియమాత పునీతురాలని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా బిషప్ ధమన్‌కుమార్, చర్చి విచారణ గురువు శాంతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ బొజ్జ సుందర్, కాంగ్రెస్ నాయకులు, చర్చి కమిటీ సభ్యులు దయాకర్‌రెడ్డి, టి.సాగర్, పి.ప్రసాద్, యాకూబ్, రవి, లింగయ్య పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

చిట్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జిట్ట న గేష్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నకాపర్తి గ్రా మానికి చెందిన అఖిల పక్ష నాయకులతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నకాపర్తి గ్రామంలో 20 సంవత్సరాల క్రితం పేదల కోసం కొనుగోలు చేసిన భూమికి ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదన్నా రు. వెంటనే పట్టాలు ఇవ్వకపోతే ప్రజలందరినీ సమీకరించి ఆ స్థలంలో గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కృష్ణనాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు గంగాపురం భాస్కర్, పాకాల నర్సింహ, శిరసు ఇద్దయ్య, రాములు, ఇద్దయ్య పాల్గొన్నారు.

క్రీడా పోటీలను జయప్రదం చేయాలి

కనగల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కనగల్ హైస్కూల్‌లో ఈ నెల 10వ తేదీన నిర్వహించే మండల స్థాయి క్రీడా పోటీలను జయప్రదం చేయాలని ఎంఈవో పద్మ కోరారు. సోమవారం కనగల్ ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 14 నుంచి 17సంవత్సరాలలోపు విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ కుంభం నర్సిరెడ్డి, శంకర్ తదితరులున్నారు.

పట్టణంలో ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

రామగిరి, సెప్టెంబరు 8, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని మైసయ్య విగ్రహ సమీపంలో అన్న పూర్ణ క్యాంటీన్ వద్ద మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో ఫు డ్ ఫెస్టివల్ స్టాల్స్‌ను సోమవారం మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా సంఘ సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శివరాంరెడ్డి, టీఎంసీ శ్రీనివాస్, మెప్మా పీడీ శ్రీనివాసన్, సీవోలు, మహిళా సంఘ నాయకురాలు తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు నిర్వహించిన ధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లోని వీధుల్లో చెత్తాచెదారం, డ్రైనేజీల్లో మురుగును నిత్యం శుభ్రం చేస్తున్నారని అన్నారు. కార్మికులు ఒక్క రోజు పనిచేయకపోతే గ్రామాలు అపరిశుభ్రంగా మారుతాయని అన్నారు. వెంటనే కార్మికులకు వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మంకాల బాలమ్మ, జంగయ్య, సతెత్తమ్మ, యాదయ్య, మల్లేషం, గణేస్, మధు, జయమ్మ, నర్సింహ, సువర్ణ, బుచ్చమ్మ పాల్గొన్నారు.

గుత్తా నర్సింహారెడ్డికి పలువురి నివాళి


నివాళులర్పిస్తున్న చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన గుత్తా నర్సింహారెడ్డి మృతిచెందాడు. సోమవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం, నార్మాక్ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి నివాళులర్పించారు. వారు మృతదేహంపై పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గుత్తా దేవేందర్‌రెడ్డి, కోనేటి యాదగిరి, చెరుకు సైదులు, పల్లపు బుద్ధుడు, పొలగోని స్వామి, పట్ల జనార్ధన్, జన్నపాల శ్రీను, లింగయ్య, దినేష్, రమేష్, శ్రీను, నరేష్, స్వామి, హరిప్రసాద్, శంకర్, వెంకన్న, రామకృష్ణ, లక్ష్మయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక



కందాళ పాపిరెడ్డి, వీరమల్ల రవీందర్

నకిరేకల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నకిరేకల్ శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాళ పాపిరెడ్డి, కార్యదర్శి వీరమల్ల రవీందర్, కోశాధికారి చిక్కు రవీందర్, అసోసియేట్ అధ్యక్షుడు పోతుల రామచంద్రయ్య, ఉపాధ్యక్షుడు పోతుల వెంకటనారాయణ, పూజార్ల ఉత్తర, జాయింట్ సెక్రటరీ భిక్షంరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.అంజయ్య, పబ్లిసిటీ సెక్రటరీ ఎస్.అంజనేయులు, గౌరవాధ్యక్షుడు వంటల రామలింగం, ముఖ్య సలహాదారుడు కందుల సోమయ్య ఎన్నికయ్యారు. సంఘం జిల్లా ప్రతినిధులు ఆంజనేయులు, రామలింగం ఆధ్వర్యంలో ఎన్నిక జరిగినట్లు తెలిపారు.

వ్యవసాయ కార్మిక చట్టం చేసి పేదలను ఆదుకోవాలి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సమగ్ర వ్యవసాయ చట్టం చేసి ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదలను, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. వ్యకాస రాష్ట్ర సమితి పిలుపుమేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు రోజువారీ ఉపాధి కోసం కొట్లాడి తెచ్చుకున్న ఉపాధి హామీ పథకానికి కేంద్రం నిధులు తగ్గిస్తూ అంబానీ, అదానీలకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్షుడు వంగాల నాగయ్య, వెంపటి శ్రీనివాస్, ఎల్లయ్య, గడ్డపాటి శ్రీశైలం, సిర్పంగి లింగస్వామి పాల్గొన్నారు.

● గట్టుప్పల్: కేంద్రప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి అధిక నిధులు కేటాయించాలని, 200 రోజులు పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగురు నర్సింహ డిమాండ్ చేశారు. వ్యకాస రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. మునిసిపాలిటీల్లో కూడా ఉపాధిహామీ పథకాన్ని చేపట్టాలని అన్నారు. వ్యవసాయ కార్మికుడు మరణిస్తే రూ.25 లక్షల బీమా వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఐ మండల కార్యదర్శి బీమనపల్లి రమేష్, వల్ల పెంటయ్య, నరసింహ, మండల నాయకులు కందాల ముత్యం, దేండె నరసింహ, రాపోలు సత్తయ్య, యాదయ్య, ధర్మయ్య, శేఖర్, చెన్నయ్య, శేఖర్, పాల్గొన్నారు.

● చిట్యాల : ఎన్నికల హామీ మేరకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని, మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి ఎండీ అక్బర్ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కృష్ణనాయక్‌కు ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాల్లో అమలు చేయాలని, సమగ్ర వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టాన్ని చేయాలని కోరారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని, పేదలకు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జిల్లా సత్యం, బొల్గూరి లింగయ్య, దేశగోని బాలరాజు, రవి పాల్గొన్నారు.



మునుగోడు: తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు


● మునుగోడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉపాధి హామీ పథకంలో రూజ 2.70కోట్ల నిధులు కెటాయించి, ప్రతి కూలీకి 200ల రోజులు పనికల్పించటంతో పాటు రూ. 700ల చొప్పున రోజు కూలీ చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ. జానీమియా డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, ఉప్పునూతల రమేష్, కాయితం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను అక్రమ కేసులతో భయపెడుతున్నారు


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలీసులు చట్టాన్ని అతిక్రమించి కాంగ్రెస్ పార్టీ చెప్పిన విధంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమకేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన డీఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా చిన్న గొడవ జరిగిందని, అనంతరం ఇరువర్గాలు రాజీపడి వెళ్లిపోయారన్నారు. నార్కట్‌పల్లికి చెందిన మణికంఠను స్టేషన్‌కు తీసుకువచ్చి బెదిరించారని ఆయన ఆరోపించారు. అవతలి వ్యక్తులు అసలు కేసు పెట్టకముందే బలవంతంగా పిటిషన్ రాయించుకుని పలువురిపై కేసులు పెట్టారని ఆరోపించారు. టూటౌన్ పోలీసులు కూడా కాంగ్రెస్ పార్టీ నాయకుల మెప్పు కోసం వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే కేసు ఉపసంహరించుకుని వారిని విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, కొండూరు సత్యనారాయణ, దేప వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య, శంకర్, జంగయ్య, పద్మ, విజయ, అనిల్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీ మేరకు పింఛన్ పెంచాలి


ధర్నా నిర్వహిస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

నల్లగొండటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ప్రకటించిన ప్రకారం దివ్యాంగులకు రూ.6వేలు, చేయూత పింఛన్‌దారులకు రూ.4 వేల పింఛన్ పెంచి ఇవ్వాలని వీహెచ్‌పీఎస్ నాయకులు పెరిక శ్రీనివాస్, ఇందిరాచౌదరి, అహ్మద్‌ఖాన్, వెంకటాచారి డిమాండ్ చేశారు. పింఛన్ పెంచకుండా నిర్లక్ష్యం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుకు నిరసనగా సోమవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పింఛన్‌దారులతో నిర్వహించిన ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్‌మాదిగ, జానకి రామయ్యాచౌదరి, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ, నాయకులు గాదె రమేష్ మాదిగ, హైమద్‌ఖాన్, మేడి శంకర్ మాదిగ, ఎర్రసాని గోపాల్, బొజ్జ చిన్న, మడుపు శ్రీను, పోలేని యాదయ్య, మాసారం వెంకన్న, తరి ఏడుకొండలు, తిరుమలేష్, రాజు పాల్గొన్నారు.

గొలుసుకట్టు చెరువులు నింపేలా ప్రణాళిక సిద్ధం చేయాలి


డీఈఈ పిచ్చయ్యకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని గొలుసుకట్టు చెరువులను వీలైనంత మేర బీ.వెల్లెంల ఉదయసముద్రం రిజర్వాయర్ నీటితో నింపేలా ఐబీ అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశించారు. నకిరేకల్‌లోని తన నివాసంలో సోమవారం నార్కట్‌పల్లి మండలంలోని ఐబీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్కట్‌పల్లి మండలంలో మొత్తం చిన్నా, పెద్దా చెరువులు, కుంటలు కలిపి 119 వరకు ఉన్నాయని, వాటిలో సాధ్యమైనంత వరకు గొలుసుకట్టు చెరువులను గుర్తించి వారబందీ విధానాన్ని అమలు చేసి నీటితో నింపాలని ఎమ్మెల్యే సూచించారు. తక్కువ ఖర్చు తో ఎక్కువ చెరువులు నింపేదెలాగో ప్రణాళికతో రావాలని కోరారు. ఎక్కడైనా రైతులు అభ్యంతరం చెప్పినా వారిని ఒప్పిస్తానని, ఒకవేళ భూ సేకరణ చేయాల్సి వచ్చినా నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. ఈ సమావేశంలో సబ్ డివిజన్ డీఈఈ పిచ్చయ్య, ఏఈఈలు నవీన్‌కుమార్, నాగరాజు, రాజశేఖర్, మాధవీప్రియ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

నకిరేకల్ : సమాజంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన మండల స్థాయి ఉపాధ్యాయుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాలో మున్సిపల్ చైర్ పర్సన్ చెవుగోని రజితా శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, ఎంఈవో మేక నాగయ్య, ఉపాధ్యాయులు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ తాత్సారం!

(5వపేజీ తరువాయి)

జూనియర్ లైన్‌మెన్ పరిధిలో 3వేలకు పైగా విద్యుత్ కనెక్షన్‌లు ఉంటాయి. వారికి సహాయంగా అసిస్టెంట్ లైన్‌మెన్‌లు ఉంటారు. విద్యుత్ సరఫరాతో పాటు విద్యుత్ అంతరాయాలు నివారించడం, మీటర్ రీడింగ్, బిల్లుల వసూళ్లు చేయడం కూడా వారిదే. ఈ పనులన్నింటినీ వారు చేయాల్సి ఉంటుంది. ఇక ఖాళీలుగా ఉన్న ప్రాంతాల్లో వారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తుండటం వల్ల వారిపై పనిభారం అదనంగా పడుతుంది.

సబ్‌స్టేషన్లలో రిటైర్డ్ ఉద్యోగులే అధికం

ఉమ్మడి జిల్లాలోని పలు సబ్‌స్టేషన్లలో సుమారు 155 మంది రిటై ర్డ్ ఉద్యోగులున్నట్లు సమాచారం. అయితే వాస్తవంగా చూస్తే రిటైర్డ్ ఉద్యోగులు కొందరూ మాత్రమే విధుల్లో కొనసాగుతుండగా వృద్ధా ప్యం, అనారోగ్యంతో వారికి బదులుగా మరొకరిని పెట్టి పనిచేయిస్తున్నారు. పోస్టులు భర్తీ చేయక పోవడంతో రిటైర్డ్ అయిన వారిని ని యమించారు. అయితే వారిస్థానంలో కొత్త పోస్టులను భర్తీచేసి ని యామకం చేస్తే నిరుద్యోగులకు అవకాశం కలుగుతుంది. ఇకపోతే 2023లో జెఎల్‌ఎం పోస్టులు భర్తీ జరిగాయి. క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు జూనియర్ లైన్‌మెన్లను నియమించారు. వారంతా క్షేత్రస్థాయిలో పని చేయాల్సి ఉన్నా, సగం మంది సబ్‌స్టేషన్‌లలో పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఈపాటికే నోటిఫికేషన్ ద్వారా పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఒకవేళ నోటిఫికేషన్ జారీ చేయకపోతే అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతుల్లో నియామకం చేపడితే విద్యుత్ వినియోగదారులకు సేవలు అందుతాయి. అయినప్పటికీ ప్రభుత్వం విధి విధానాలను రూపొందించకపోవడం, విద్యుత్‌శాఖలో ఖాళీలు భర్తీ చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రభుత్వ శాఖల్లో విద్యుత్‌శాఖ కీలకమైనది. అయితే ఇంతా కీలకమైన శాఖలో ఖాళీలపై ప్రభుత్వం ఏ రోజు కూడా సమీక్ష చేయకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో ఆర్టిజన్‌లుగా గుర్తింపు పొందిన కార్మికులు తమను రెగ్యులర్ చేయాల్సిందిగా కొంతకాలంగా డిమాండ్ ఉంది. అయితే ఖాళీల స్థానంలో ఆర్టిజన్లను జేఎల్‌ఎంలుగా తీసుకుంటే క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత తగ్గుతుందన్న వాదన విద్యుత్ ఉద్యోగ సంఘాల్లో వి నిపిస్తుంది. మొత్తానికి ఇప్పటికైనా ప్రభుత్వం ఖాళీల భర్తీపై దృష్టిసారించాలని ఆయా విద్యుత్ సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

వేతనాల్లో 'కోత'

(5వపేజీ తరువాయి)


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న జీపీ వర్కర్స్ నేతలు

పంచాయతీల్లో సిబ్బందికి వేతనాల్లో కోతపెట్టారు. ప్రభుత్వం ఎంపీడబ్ల్యూఎస్‌గా నిర్ణయించిన రూ.9500కు అదనంగా పెంచిన వేతనాన్ని ఇవ్వడాన్ని ప్రభుత్వం తప్పుబట్టింది. ఎంపీడబ్ల్యూఎస్‌గా నిర్ణయించిన వేతనానికి అదనంగా సాధారణ నిధల నుంచి వేతనాన్ని చెల్లించడమంటే రెండు పర్యాయాలు వేతనాన్ని చెల్లించడమేనన్నట్లు భావించింది. ఇలా చెల్లిస్తున్న గ్రామపంచాయతీ పంచాయతీ కార్యదర్శులకు డీపీవో ద్వారా మెమో జారీచేసింది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి గ్రీన్‌చానల్ ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన రూ.9500 వేతనం మాత్రమే అందింది. జీపీ సాధారణ నిధుల నుంచి ఇచ్చే అదనపు వేతనాన్ని నిలిపివేశారు. దీంతో మేజర్ గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి వేతనాలు పెరగడమేమో కాని ఉన్న వేతనాల్లో కోత పడే పరిస్థితి దాపురించింది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వేతనం



గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి గ్రీన్‌చానల్ ద్వారానే వేతనాలు చెల్లించాలని ఆదేశాలున్నాయి. అంతకు మించి చెల్లించిన పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారుల నుంచి తాఖీదులు అందాయి. ఎంపీడబ్ల్యూఎస్‌గా ఎంత వేతనం ఇవ్వాలో అంతే వేతనాన్ని గ్రీన్‌చానల్ ద్వారా చెల్లిస్తున్నాం. పాలకవర్గాల తీర్మానం ద్వారా ఇప్పటివరకు జనరల్ ఫండ్ నుంచి చెల్లించిన మిగతా వేతనాలను ఇప్పుడు చెల్లించలేం.

- సుధాకర్, ఎంపీవో, నార్కట్‌పల్లి

సంక్షిప్తంగా...

● చిట్యాలరూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం రోజు నల్లగొండలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు, పోలీసులు దాడిచేయడం హేయం మని బీజేపీ చిట్యాల మండల అధ్యక్షుడు పీక వెంకన్న అన్నారు. వర్షిత్‌రెడ్డిపై దాడికి నిరసనగా మండలంలోని ఉరుమడ్లలో సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉయ్యాల లింగస్వామి,మండల కార్యదర్శి ఆకుల వెంకన్న, అశోక్‌గౌడ్, గడిగల కోటేష్, లింగస్వామి, వెంకన్నపాల్గొన్నారు.


● కనగల్ : ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జిగా రెగట్టే గ్రామానికి చెందిన శోభన్‌మాదిగ ఎంపికయ్యారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు శోభన్‌కు నియామకపత్రం అందజేశారు. అలాగే ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అన్నెపాక శంకర్ మాదిగను నియమించినట్టు ప్రకటించారు.

● మునుగోడు : కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ తగ్గిస్తూ వివిధ సరుకుల కొనుగోళ్ల కోసం అన్నివర్గాల ప్రజలపై పన్ను భారం తగ్గించటం పట్ల బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు పెంబళ్ల జానాయ్యయాదవ్ హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బీఆర్. అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

● మర్రిగూడ : మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని శివన్నగూడెంకు తరలించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మాజీ ఎంపీపీ అనంతరాజు గౌడ్ సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతమైన మర్రిగూడ మండలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందక ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారన్నారు.

● కట్టంగూరు : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా ఉపసంచాకులు శశికళ అన్నారు. కట్టంగూరులోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సోమవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు అందుతున్న మెనూ, నోట్ పుస్తకాలు, యూనిఫాం గురించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో స్వామి, హాస్టల్ వార్డెన్ గుజ్జుల శంకర్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

● మర్రిగూడ మర్రిగూడ ఆదర్శ పాఠశాల, వసతి గృహంలో మౌలిక వసతులు కల్పించుటకు వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలని, ఆ పాఠశాల అభివృద్ధి కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించారు. సోమవారం ఆదర్శ పాఠశాలలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు సమక్షంలో పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కృష్ణా జిల్లా సరఫరా కోసం పైప్ లైన్ ఏర్పాటు చేయాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు అవసరమైన గది ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లపై కమిటీ చర్చించి తీర్మానం చేశారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీలు పాశం సురేందర్ రెడ్డి, మేతరి యాదయ్య, రాందాస్ శ్రీనివాస్, మేకల జగన్ రెడ్డి, మాస చంద్రశేఖర్, పాత నగేష్, అల్వాల్ రెడ్డి, బాలయ్య పలువురు ఉన్నారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.20 (309.6546)	1,67,448	1,67,448
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,280.99	1,280.99
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.3577 (43.2558)	1,40,113	88,934

చికెన్ ధరలు	లైవ్ : రూ.144	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.240




ఎన్నాళ్లీ తాత్సారం!

- విద్యుత్‌శాఖలో భారీగా పోస్టుల ఖాళీలు
- జేఎల్ఎం, అసిస్టెంట్ లైన్‌మన్ల పోస్టుల భర్తీలో జాప్యం
- సిబ్బంది కొరతతో క్షేత్ర స్థాయిలో అందని సేవలు
- ఖాళీల భర్తీపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- విద్యుత్ శాఖ ఖాళీలపై దృష్టిసారించని ప్రభుత్వం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యుత్ శాఖలో భారీగా పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యుత్ వినియోగదారులకు సేవలు అందడం లేదు. గృహ విద్యుత్‌తో పాటు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సేవలు అందించాల్సిన పోస్టులే ఖాళీగా ఉండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి గ్రీన్ సిగ్నల్ లేకపోవడంతో పోస్టులపై ఎటూ తేలడం లేదు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ/ నల్లగొండటౌన్)

జిల్లాలో అసిస్టెంట్ లైన్‌మెన్‌లు, జూనియర్ లైన్‌మెన్ల నియామకాన్ని విద్యుత్ శాఖ పట్టించుకోకుండా ఉంటుందన్న ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది కొరత కారణంగా ప్రస్తుతం ఉన్న సిబ్బందిపైనే భారం పడుతుంది. దీంతో ప్రస్తుతం ఉన్న సిబ్బంది అత్యధిక గంటలు డ్యూటీ చేయడంతో వారు మానసికంగా, ఆరోగ్యపరంగా దెబ్బతింటున్నారు. గాలిదుమారాలు, వర్షాలకు, ఇతర కారణాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణం కరెంటు పునరుద్ధరించడం కష్టమవుతుంది. మూడు జిల్లాల్లో వ్యవసాయ, గృహ విద్యుత్ అన్ని కలిపి మొత్తం 19,32,183 కనెక్షన్‌లు ఉన్నట్లు తెలుస్తుంది. ఇందులో అత్యధికంగా గృహ విద్యుత్ కనెక్షన్‌లే ఉండటంతో తరచుగా కరెంటుకు అంతరాయం కలిగితే పునరుద్ధరించడం సమస్యగా మారుతుంది. 2023లో కొంత మేరకు జూనియర్ లైన్‌మెన్‌ల నియామకం చేపట్టినప్పటికీ వారిని క్షేత్ర స్థాయిలో వినియోగించుకోకుండా 50శాతానికి పైగా జూనియర్ లైన్‌మెన్‌లను సబ్‌స్టేషన్లకు పరిమితం చేశారు. దీంతో ఫీల్డ్‌లో పని చేసే వారు లేక అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.



లైన్‌మన్లపై పనిభారం

ప్రస్తుతం పనిచేస్తున్న లైన్‌మన్లపై భారం పడుతున్నా కొత్త నియామకాలు లేకపోవడంతో పనిచేస్తున్న సిబ్బంది తీవ్ర పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలు కానరావడం లేదు. నియామకం విషయంలో ప్రభుత్వం పదేపదే ప్రకటనలు చేయడం తప్ప పోస్టుల భర్తీలో జాప్యం చేస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నల్లగొండ జిల్లాలో మొత్తం 194 అసిస్టెంట్ పోస్టులు ఉండగా, 144 మంది పనిచేస్తున్నారు. ఇంకా 50 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా జూనియర్ లైన్‌మెన్ పోస్టులు 272 మంది ఉండగా విధుల్లో 150 మంది ఉన్నారు. ఇంకా 122 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదే విధంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 90 అసిస్టెంట్ పోస్టులు ఉండగా 62మంది పనిచేస్తున్నారు. ఇంకా 28 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు సూర్యాపేట జిల్లాలో 210 మంది జెఎల్ఎం పోస్టులు ఉండగా, 110 మంది మాత్రమే పనిచేస్తున్నారు. సుమారు 100 పోస్టుల వరకు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. అత్యధికంగా జూనియర్ లైన్‌మెన్ పోస్టులే ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో పనిచేసే ఒక్కో..

- మిగతా 8వ పేజీలో...

సిబ్బంది కొరత వాస్తవమే

క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమే. అయినప్పటికీ విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు ఎలాంటి అంతరాయం తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. యాజమాన్యం నుంచి వచ్చిన ఆదేశాల అనంతరం త్వరలోనే పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకుంటాం. అప్పటి వరకు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్వర్లు, ఎస్ఈ, నల్లగొండ

పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితా ప్రచురణ రేపు

జడ్పీ సీఈవో శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీనివాసరావు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రాదేశిక నియోజకవర్గాలవారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితాను ఈ నెల 10న మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రచురించనున్నట్లు జడ్పీ సీఈవో శ్రీనివాసరావు తెలిపారు. ముసాయిదా పోలింగ్‌కేంద్రాల జాబితా, ఓటరు జాబితాలను ఈ నెల 6న ప్రచురించిన నేపథ్యంలో సోమవారం ఆయన తన ఛాంబర్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 33 మండలాలకు 33 జడ్పీటీసీలు, 33 ఎంపీపీలు, 353 ఎంపీటీసీలున్నాయని, మొత్తం 1,956 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 10,73,506 ఓటర్లున్నారని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాల పై ఈ నెల 6న నుంచి 8 వరకు అభ్యంతరాలు స్వీకరించామని, ఈ నెల 9న అభ్యంతరాల పరిష్కారం, 10న తుది ఓటరు జాబితాను, పోలింగ్ కేంద్రాల జాబితాను మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్‌లలో ప్రచురిస్తామన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే వెంటనే తెలియజేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నుంచి గుమ్మల మోహన్‌రెడ్డి, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పశువుల్లో లంపి వ్యాధి కలకలం

- వైరస్‌తో మృత్యువాతపడుతున్న దూడలు
- రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యుల సూచన



డిండి మండలంలోని పశువులకు లంపి చర్మవ్యాధి సోకింది. దూడల పై వైరస్ తీవ్ర ప్రభావం చూపి మృత్యువాతపడుతున్నాయి. పశువులు మేతమేయకపోవడం, నీరసంగా ఉండడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలు కనిపించడం రైతులను ఆందోళనకు గురిచేస్తుంది. గాలి, నీరు, ఆహారం ద్వారా కూడా పశువులు ఈ వ్యాధి బారిన పడుతున్నాయి. గుర్తించేలోపే వ్యాధి తీవ్రత పెరిగి మృతి చెందుతున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-డిండి) - వివరాలు 7లో..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కలెక్టర్



గుర్రంపోడు కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

గుర్రంపోడు,సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి):పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మండలకేంద్రంలోని కేజీబీవీ,పీహెచ్‌సీ,ఎంపీడీవో కార్యాలయాలను సోమవారం తనిఖీచేశారు. వంట గది,డైనింగ్, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండగా పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ, ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ న్నారు.

మండల ప్రత్యేక అధికారులు పాఠశాలలను సందర్శించాలి

నల్లగొండ టౌన్: మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా పాఠశాలలను సందర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని వారికి అవగాహన కల్పించాలన్నారు. జాతీయ కుటుంబ ప్రాయోజన పథకం కింద బాగా పనిచేసిన ఉద్యోగులను ఈ నెల 13వ తేదీన మంత్రులు సన్మానిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, ఇన్‌చార్జి డీఆర్వో, వై. అశోక్‌రెడ్డి, ఆర్డీవో రమణారెడ్డి, శ్రీదేవి, గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మూడు నెలలుగా ఆగిన పింఛన్.. స్పందించిన కలెక్టర్

తన కుమారుడికి మూడు నెలలుగా పింఛన్ రావడం లేదని బాధితుడి తల్లి మండల స్థాయి అధికారుల వద్దకు వెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. సోమవారం కలెక్టర్ దృష్టికి వెళ్లిన వెంటనే వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం నెల్లికల్లు గ్రామానికి చెందిన బోయ సత్యనారాయణరెడ్డి కుమారుడు వెంకటరామిరెడ్డి పోలియోతో మరుగుజ్జుగా సొంత పనులు కూడా చేసుకోలేని స్థితిలో ఉన్నాడు. మూడు నెలల క్రితం ఫేషియల్ రీడింగ్ ద్వారా పింఛన్ ఇస్తుండడంతో వెంకటరామిరెడ్డికి కళ్లు కంప్యూటర్‌లో స్పష్టంగా కనపడకపోవడంతో పింఛన్ ఆగిపోయింది. దీంతో తల్లిదండ్రులు అతనిని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి దీనస్థితిని వివరించారు. స్పందించిన కలెక్టర్ బాధితుడికి ఇవ్వాలని ఆదేశించారు.

డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేయాలి

మర్రిగూడ: ప్రభుత్వం నియమించిన చోట కాకుండా ఉపాధ్యాయురాయిలిని డిప్యూటేషన్‌పై ఎందుకు పంపించారని కలెక్టర్ ఇలా త్రిపాఠి డీఈవో భిక్షపతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాంపల్లి మండలం నరసింహులగూడెం పాఠశాలకు రోహిణిని ప్రధానోపాధ్యాయురాలిగా నియమితులయ్యారు. అనారోగ్యం పేరుతో రోహిణి ఓడీపై మునుగోడు మండలంలోని పులిపలుపుల పాఠశాలకు విద్యాశాఖ అధికారి డిప్యూటేషన్ వేశారు. హెచ్ఎంను పాఠశాలకు పంపించాలని, ఇద్దరు ఉపాధ్యాయులలో ఒకరిని డిప్యూటేషన్ వేయడంతో ఒక ఉపాధ్యాయుడితో ఇబ్బందిగా ఉందని పాఠశాల విద్యార్థినిలు, గ్రామస్థులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ డీఈవోను పిలిపించి ప్రభుత్వ నియమించిన చోట కాకుండా డిప్యూటేషన్ ఎందుకు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్మికుల వేతనాల్లో కోత

- నార్కట్‌పల్లి, చెర్వుగట్టు, ఎల్లారెడ్డి గూడెం జీపీల్లోనే ఈ పరిస్థితి
- కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధిత జీపీ వర్కర్లు
- పరిశీలిస్తానని హామీ ఇచ్చిన కలెక్టర్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నార్కట్‌పల్లి మండల పంచాయతీ సిబ్బంది

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించే గ్రీన్‌ఛానల్ విధానం జిల్లాలోని కొన్ని గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగులకు శాపమైంది. గ్రీన్‌చానల్ విధానంతో వారి వేతనాల్లో కోత పడింది. జిల్లాలోని ప్రధాన మేజర్ గ్రామ పంచాయతీల్లోనే ఈ సమస్య ఏర్పడింది. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ నార్కట్‌పల్లి మండలంలోని నార్కట్‌పల్లి, చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీల బాధిత కార్మికులు ఆందోళనతో సోమవారం కలెక్టర్‌ను ఆశ్రయించారు. తమకు వేతనాల చెల్లింపులో జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ కలెక్టర్‌కు 'ప్రజావాణి'లో వినతి పత్రం అందజేయగా, పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

ఎంపీడబ్ల్యూఎస్‌లుగా రూ.9500 వేతనం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులను మల్టీపర్పస్ (ఎంపీడబ్ల్యూఎస్) వర్కర్లుగా గుర్తించింది. అంటే గ్రామపంచాయతీలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు అవసరమైతే అన్ని రకాల విధులు చేయాల్సి ఉంటుందనేది ఈ కొత్త విధానం ఉద్దేశం. ఇందులో భాగంగా జనాభా ప్రాతిపదికన గ్రామపంచాయతీల్లో ఎంత మంది కార్మికులు, సిబ్బంది ఉండాలో కేడర్ స్ట్రెంథ్ నిర్ణయించి ఆ ప్రకారం వేతనాలను నిర్దేశించారు. ఈ ప్రకారం మేజర్, చిన్న గ్రామ పంచాయతీలు అనే బేధం చూపకుండా అన్నిగ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగులకు రూ.9500 చొప్పున యూనిఫాంగా వేతనం చెల్లించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అన్ని గ్రామపంచాయతీలు సాధారణ నిధుల నుంచి వేతనాలు చెల్లిస్తున్నాయి.

'గ్రీన్‌ఛానల్' ద్వారా వేతనాలు...


రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది సెప్టెంబరు నుంచి గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వమే గ్రీన్‌ఛానల్ ద్వారా వేతనాలు ఇస్తుంది. గ్రామపంచాయతీ ఖాతా టీఎస్‌బీపాస్‌లో వేసిన తర్వాత సదరు జీపీ పంచాయతీ కార్యదర్శి ఆ వేతనాలను కార్మికుల వ్యక్తిగత ఖాతాలో జమ చేస్తున్నారు. అయితే రూ.9500 ప్రభుత్వం చెల్లిస్తుండగా కొన్ని మేజర్ గ్రామపంచాయతీలు పాలకవర్గాల తీర్మానం మేరకు పనిభారం ఆధారంగా పెంచిన వేతనాల మిగతా మొత్తాన్ని సాధారణ నిధుల ద్వారా చెల్లిస్తున్నారు. అంటే ఉదాహరణకు ఓ మేజర్ గ్రామ పంచాయతీలో ఓ సిబ్బందికి అతని సీనియారిటీని బట్టి రూ.14,500 వేతనం ఉందనుకుందాం. గ్రీన్ చానల్ ద్వారా చెల్లించే రూ.9500 పోను మిగతా రూ.5,000ల వేతనం డబ్బులను జీపీ జనరల్ ఫండ్ నుంచి చెల్లిస్తున్నారు.

వేతనాల్లో 'కోత'లెందుకు..

గ్రామపంచాయతీల్లో 2025 మార్చి వరకు పూర్తి వేతనాలు అందగా, ఆ తదుపరి కొన్ని గ్రామ...

- మిగతా 8వ పేజీలో...

పని భారంతోనే వేతనాల పెంపు



ఎంపీడబ్ల్యూఎస్‌లుగా ప్రభుత్వం కొత్త విధానం ప్రవేశపెట్టి రూ.9500గా వేతనం నిర్ణయించినా జీపీల్లో ఉండే పని భారాన్ని బట్టి పాలకవర్గాలు తీర్మానం చేసి సీనియారిటీ ఆధారంగా వేతనాలను పెంచాయి. ఇందులో భాగంగానే నాకు రూ.14,500వేతనం ఇస్తుండగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రూ.9500 మాత్రమే చెల్లించారు. అంటే ప్రతీ నెలా రూ.5,000 నష్టపోతున్నా. ఎక్కడైనా వేతనం పెంచుతారు, కానీ మాకు మాత్రం వేతనాల్లో కోతపెట్టడం వింతగా ఉంది.

- షకీల్, వాటర్‌మెన్

మొబైల్‌యాప్‌ల పని ఒత్తిడిని తగ్గించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొన్న దేవేందర్‌రెడ్డి, ఏఎన్ఎంలు

నల్లగొండటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ నందు ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న వారు ఆన్‌లైన్ యాప్‌లతో తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, తక్షణమే వాటిని రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాం డ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఎన్ఎంలు నిర్వహించిన ధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవటానికి, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏఎన్ఎంలు పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా, అనారోగ్యానికి గురైన వారికి చికిత్స అందించేందుకు, చిన్నపిల్లలకు టీకాలు వేయడంలో ఏఎన్ఎం పాత్ర కీలకమని అన్నారు. మారుతున్న పరిస్థితుల రీత్యా కొంతకాలంగా ఏఎన్ఎంలు చేసే పనులకు సంబంధించిన కొన్ని రిపోర్టులను ఆన్‌లైన్ ద్వారా పం పించాలన్నారు. ఆన్‌లైన్ పనుల నుంచి ఏఎన్ఎంలందరికీ మినహాయింపు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కేఎస్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి విశ్వనాధులు లెనిన్, ఏఎన్ఎం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. గీతారాణి, కోశాధికారి ఎస్.పద్మ, సరిత, భవాని, శారద, ఎస్.రేణుక, నాగమణి, సిహెచ్. సరిత, హైమావతి, బి.హరిత, ఎం.నిర్మల, శిల్ప, మాధురి, అనిత, సునీత, జ్యోతి, సులోచన, ఎస్.పద్మ, రుక్సానా, అన్నమ్మ, శోభారాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ బాధితులకు అండగా ఉంటాం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం.

మునుగోడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్)లో భూములు కోల్పోతున్న రైతులకు అండగా నిలుస్తామని ఎమ్మెల్సీ సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రిపుల్‌ఆర్‌ను దక్షిణ ప్రాంతంలో అలైన్‌మెంట్ ప్రక్రియను పలుమార్లు మార్చు చౌటుప్పల్ పరిధిలోని ఓ కంపెనీ భూములను కాపాడాలన్న కుట్ర ఫలితమేనని ఆయన స్పష్టం చేశారు. దీంతో అమాయక రైతులు తమ సాగు భూములను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులకు బహిరంగ మార్కెట్ ధరలకు అనుగుణంగా 10రెట్ల ధర చొప్పున లెక్కకట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతులను సమీకరించి ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో యూరియా కొరత నియంత్రించటంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. జిల్లా కేంద్రంలో 10వ తేదీన నిర్వహించనున్న మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వమించాలని శ్రేణులకు సూచించారు. పార్టీ మండల కార్యవర్గ సభ్యుడు ఉప్పునూతల రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు సురిగి చలపతి, లాలు, గోసుకొండ లింగయ్య, మందుల పాండు, బండమీది యాదయ్య, వెంకన్న, కైలాసం, దుబ్బ వెంకన్న, కాయితం వెంకన్న, సత్తమ్మ, దయాకర్, శంకర్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

మాడ్గులపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. జీఎస్టీని తగ్గించడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులకు కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులవారికి జీఎస్టీ భారం తగ్గుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, విద్యాసాగర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జాన్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, బొమ్మకంటి నరసింహ, నాగరాజు, శ్రీను, సైదులు ఉన్నారు.

21 నుంచి దసరా సెలవులు

రామగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి అక్టోబరు 3 వరకు పాఠశాలలకు దసరా సెలవు ఇస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఈ నెల 28 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు కళాశాలలకు కూడా సెలవులు ప్రకటిస్తున్నామని, విద్యార్థులు గమనించాలని ఆయన కోరారు.

తెరుచుకున్న ఆలయాలు

- సంప్రోక్షణ పూజలు
- 8.15 గంటల నుంచి దర్శనాలు

7



అలంకార ప్రాయంగా హైమాస్ట్ లైట్లు

▸▸ గ్రామాల్లో పనిచేయని వీధి దీపాలు ▸▸ ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు ▸▸ పట్టించుకోని అధికారులు



కుర్మేడ్ చౌరస్తాలో ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తున్న ఆకాశదీపాలు

చింతపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రధాన సెంటర్లలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు అలంకార ప్రాయంగా మారింది. రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఈ లైట్లు నిర్వాహణ లేక మరమ్మతు లేక నిరుపయోగంగా మారాయి. గొడకొండ్ల, పోలేపల్లిరాంనగర్, కుర్మేడ్ చౌరస్తా, వేంకటేశ్వరనగర్(మాల్), మదనాపురం, తక్కెళ్లపల్లి, చాకిలిశేరుపల్లిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు మ రమ్మతుకు చేపట్టడంతో వెలుగులు పంచడం లేవు. గతంలో సర్పంచుల పరిపాలనలో నిధులు సమృద్ధిగా రావడంతో అభివృద్ధి పనులు చేసేవారు. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలనలో నిధులు లేక నిర్వాహణ సక్రమంగా లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు రాక సమస్యలు తీరక....

వీధి దీపాల నిర్వాహణ రెండేళ్లుగా మరమ్మతులకు గురైన వాటిని అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల అభివృద్ధి కోసం నిధులు ఇప్పటి వరకు విడుదల కాకపోవడంతో కార్యదర్శులపై భారం పడింది. దీంతో ఆర్థికపరంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కార్యదర్శులు చెబుతున్నారు.

ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ప్రజలు వాపోతున్నారు అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో త్వరలో పర్యటించి హైమాస్ట్ లైట్లు పరిశీలించి ఎస్టిమేషన్ సిద్ధం చేసి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు మౌలిక వసతి సౌకర్యాల కల్పన కోసం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారిస్తాం.

\- సుజాత, ఎంపీడీవో, చింతపల్లి



కొండపై వెళ్లేమార్గంలో పేరుకుపోయిన చెత్త

కంపు కొడుతోంది

చింతపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్ (మాల్) కొండపై నెలకొన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా రంగారెడ్డి, నల్లగొండ జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్న కొండపై ప్రతీ శనివారం భక్తులు వెళ్లి దర్శించుకుంటారు. రహదారి సమీపంలో పలువురు చెత్తాచెదారం ఇష్టారాజ్యంగా వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. ఆలయానికి వెళ్లే భక్తులు వాసన భరించలేక తీవ్రఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చెత్తను తొలగించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి



ఉచిత వైద్యశిబిరంలో మాట్లాడుతున్న సీఐ వెంకట్‌రెడ్డి

దేవరకొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీఐ వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా సోమవారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, డాక్టర్ సునీల్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వెన్నునొప్పి తీవ్రంగా ఉన్న పరిస్థితులలో ఫిజియోథెరఫీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. స్పోర్ట్స్ అసోసియేషన్ ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కృష్ణకిషోర్, సురేష్, భాస్కర్, చైతన్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. 80 మందికి ఫిజియోథెరపితో పాటు ఉచిత వైద్యసేవలు అందించినట్లు వారు పేర్కొన్నారు.

శిబిరంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు

దేవరకొండ: ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ సహస్ర అధ్యక్షురాలు పున్న శైలజ, భాగ్యలక్ష్మి అన్నారు. దేవరకొండలో లయన్స్‌క్లబ్ సహస్ర ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరం ఉన్నవారిని క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సహస్ర నిర్వాహకులు జయలక్ష్మి, పద్మ, ఎల్లయ్య పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

● జీపీవోలకు తహసీల్దార్ కృష్ణయ్య సూచన



తహసీల్దార్ కార్యాలయంలో జీపీవోను సన్మానిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య

నిడమనూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కొత్తగా నియమితులైన జీపీవోలు బాధ్యతాయుతంగా పని చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని తహసీల్దార్ జంగాల కృష్ణయ్య అన్నారు. మండలానికి కేటాయించిన 8 మంది జీపీవోలలో ఏడుగురు జీపీవోలు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రిపోర్టు చేసి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా తహసల్దార్ కృష్ణయ్య వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్వ వీఆర్‌వోలు జీపీవోలుగా మళ్లీ రెవెన్యూ శాఖలోకి తిరిగి రావడం ఆనందంగా ఉందని అన్నారు. జీపీవోలు తమకు కేటాయించిన గ్రామాల్లో సమర్థంగా పనిచేయాలని, రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మండలంలో పని చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ప్రశాంతంగా పని చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరిస్తారని తెలిపారు. ముప్పారం క్లస్టర్ జీపీవో మినహా మిగతా ఏడుగురు జీపీవోలు విధుల్లో చేరారు. కార్యక్రమంలో డీటీ మల్లికార్జున్, మోహన్‌కృష్ణ, పేలపూడి సతీష్, జీపీవోలు మాతంగి సురేష్, సయ్యద్ నజీర్, సరిత, నిడిగొండ నరేష్, శ్రీనివాస్, సైదులు, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్న మోదీ



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేస్తున్న కేంద్రప్రభుత్వం పేదల ఆర్థిక ఇబ్బందులను తొలగించేందుకు వస్తు సేవల పన్నులో భారీ మార్పులు చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాధినేని శ్రీనివాసరావు అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశాన్ని ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా పునర్నిర్మిస్తున్న ప్రధాని మోదీ తీసుకుంటున్న నిర్ణయాలు 140 కోట్ల ప్రజలకు మేలు చేసేలా ఉన్నాయన్నారు. అనంతరం బస్టాండ్ ఎదుట స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బంటు సైదులు, ముక్కపాటి వెంకటేశ్వరరావు, రేపాల పురుషోత్తంరెడ్డి, బొట్టు సోములు, నక్క రవి, ఎడ్ల శృతి, నంద, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మెనూప్రకారం అల్పాహారం అందించాలి



కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మాడ్గులపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ విద్యార్థినులకు సిబ్బంది సమయానుకూలంగా అల్పాహారం అందించడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ అన్నారు. నల్లగొండలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి సోమవారం వినతిపత్రం అందచేసి మాట్లాడారు. కేజీబీవీ విద్యార్థినులకు ఉదయం 8గంటలకు పెట్టాల్సిన అల్పాహారం 10.45 గంటలకు అందిస్తున్నారని, దీంతో వారు నీరసపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో మెనూ అమలు చేయడం లేదని, ఎస్‌వో రెగ్యులర్ విధులకు హాజరుకావడం లేదని ఆరోపించారు. విద్యార్థినులకు అందించాల్సిన మటన్, చికెన్, గుడ్లు, పండ్లు, స్నాక్స్ టెండర్ల వారు అందించడకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో సమయానుకూలంగా మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్ర సైదానాయక్, కిరణ్, వీరన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

● మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాధికారి భిక్షపతి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి భిక్షపతి

హాలియా, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత కోసం గ్రామ కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాధికారి భిక్షపతి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గ్రామ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో దోమలు, ఈగల కారణంగా సీజనల్ వ్యాధులు సక్రమిస్తాయని, ఈ విషయాలపై తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల కారణంగా జ్వరాలు ఇతర వ్యాదులు సంక్రమిస్తే వెంటనే వైద్యశిబిరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను జాగృతం చేయాలని పేర్కొన్నారు. వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం డ్రైనేజీల పరిశుభ్రత, రహదారులు తదితర విషయాలపై పలు సూచనలు చేశారు. సమావేశంలో మండల అభివృద్ధి అధికారి సుజాత, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు 200 రోజులకు పెంచాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యకాస నాయకులు

దేవరకొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పని దినాలు 200 రోజులకు పెంచి అందరికీ పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం దేవరకొండ మండల కార్యదర్శి కిన్నెర బారిముల్లు డిమాండ్ చేశారు. దేవరకొండలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి కేంద్రప్రభుత్వం రూ. 2.70లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మునిసిపాలిటీ పరిధిలో కూడా ఉపాధి హామీ పథకాన్ని విస్తరించి పని కల్పించాలని, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యకాస నాయకులు శ్రీను, కిన్నెర అనిల్‌కుమార్, బిక్షం, తిరుపతమ్మ, యాదమ్మ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వనం సుధాకర్

మిర్యాలగూడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా విద్య, వైద్యం అందించాలని ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర ప్రధానకార్యదర్శి వనం సుధాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ పో రాటయోధుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శతజయంతి సందర్భంగా ఏఐఎఫ్‌డీవై జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలే భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాథమిక అవసరాల్లో విద్య, వైద్యం ముఖ్యమైనదని అన్నారు. ప్రస్తుత సమాజంతో సామాన్యులకు ఆ రెండు అందనంత దూరంలో ఉన్నాయన్నారు. విద్యకు, వైద్యానికి లక్షలు వెచ్చించాల్సి రావడంతో పేద మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ప డుతున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం జాతీయ విద్యావిధానం పేరుతో కాషాయ విద్యను ప్రవేశపెడుతుందని అన్నారు. ప్రజలకు శాస్త్రీయ విద్యను అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టెస్టులకు, శస్త్రచికిత్సలకు అవసరమైన పరికరాలు అందుబాటులో లేవన్నారు. వైద్యసిబ్బంది కొరతతో సకాలంలో వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందించే వరకు ఉద్యమిస్తామని అన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పోతుగంటి కాశీ, రవినాయక్, శ్రీరాములు, వస్కుల సైదమ్మ, ముండ్ల గిరి కాంతయ్య, వజ్రగిరి అంజయ్య, గోవర్దన, అరుణ, నాగేశ్వరావు, భరత్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ ఎంపికలో అవకతవకలు : ఎస్ఎఫ్ఐ



సమావేశంలో మాట్లాడుతున్న నల్లబెల్లి జగదీష్

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయని ఎస్ఎఫ్ఐ నాగార్జునసాగర్ డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీష్ ఆరోపించారు. మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావాలంటే 15 సంవత్సరా ల సర్వీస్ ఉండాలని నిబంధనలో పేర్కొన్నారని కాని అలా సర్వీస్ లేకున్నా కొందరిని ఎంపిక చేసినట్లు ఆరోపించారు. పలువురిని నిబంధనలకు విరుద్ధంగా త్రీమన్ కమిటీ ద్వారా సిఫారసు చేయడంపై విద్యార్థి, మేధావి వర్గాల్లో పలు సందేహాలు కలుగుతున్నాయని అన్నారు. జిల్లా అధికార యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టించేలా పలువురిని ఉత్తమ ఉపాధ్యాయులుగా సిఫారసు చేయడంపై తగిన విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల నాయకులు శివ, నరేష్, బ్రహ్మం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ తాత్సారం!

(5వపేజీ తరువాయి)

జూనియర్ లైన్‌మెన్ పరిధిలో 3వేలకు పైగా విద్యుత్ కనెక్షన్‌లు ఉంటాయి. వారికి సహాయంగా అసిస్టెంట్ లైన్‌మెన్‌లు ఉంటారు. విద్యుత్ సరఫరాతో పాటు విద్యుత్ అంతరాయాలు నివారించడం, మీటర్ రీడింగ్, బిల్లుల వసూళ్ల చేయడం కూడా వారిదే. ఈ పనులన్నింటినీ వారు చేయాల్సి ఉంటుంది. ఇక ఖాళీలుగా ఉన్న ప్రాంతాల్లో వారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తుండటం వల్ల వారిపై పనిభారం అదనంగా పడుతుంది.

సబ్‌స్టేషన్లలో రిటైర్డ్ ఉద్యోగులే అధికం

ఉమ్మడి జిల్లాలోని పలు సబ్‌స్టేషన్లలో సుమారు 155 మంది రిటైర్డ్ ఉద్యోగులున్నట్లు సమాచారం. అయితే వాస్తవంగా చూస్తే రిటైర్డ్ ఉద్యోగులు కొందరూ మాత్రమే విధుల్లో కొనసాగుతుండగా వృద్ధాప్యం, అనారోగ్యంతో వారికి బదులుగా మరొకరిని పెట్టి పనిచేయిస్తున్నారు. పోస్టులు భర్తీ చేయక పోవడంతో రిటైర్డ్ అయిన వారిని నియమించారు. అయితే వారిస్థానంలో కొత్త పోస్టులను భర్తీచేసి నియామకం చేస్తే నిరుద్యోగులకు అవకాశం కలుగుతుంది. ఇకపోతే 2023లో జెఎల్‌ఎం పోస్టులు భర్తీ జరిగాయి. క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు జూనియర్ లైన్‌మెన్లను నియమించారు. వారంతా క్షేత్రస్థాయిలో పనిచేయాల్సి ఉన్నా, సగం మంది సబ్‌స్టేషన్‌లలో పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఈపాటికే నోటిఫికేషన్ ద్వారా పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఒకవేళ నోటిఫికేషన్ జారీ చేయకపోతే అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతుల్లో నియామకం చేపడితే విద్యుత్ వినియోగదారులకు సేవలు అందుతాయి. అయినప్పటికీ ప్రభుత్వం విధి విధానాలను రూపొందించకపోవడం, విద్యుత్‌శాఖలో ఖాళీలు భర్తీ చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రభుత్వశాఖల్లో విద్యుత్‌శాఖ కీలకమైనది. అయితే ఇంతా కీలకమైన శాఖలో ఖాళీలపై ప్రభుత్వం ఏ రోజు కూడా సమీక్ష చేయకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో ఆర్టిజన్‌లుగా గుర్తింపు పొందిన కార్మికులు తమను రెగ్యులర్ చేయాల్సిందిగా కొంతకాలంగా డిమాండ్ ఉంది. అయితే ప్రస్తుతం ఉన్న ఖాళీల స్థానంలో ఆర్టిజన్లను జేఎల్‌ఎంలుగా తీసుకుంటే క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత తగ్గుతుందన్న వాదన విద్యుత్ ఉద్యోగ సంఘాల్లో వినిపిస్తుంది. మొత్తానికి ఇప్పటికైనా ప్రభుత్వం ఖాళీల భర్తీపై దృష్టిసారించాలని ఆయా విద్యుత్ సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

సురవరం సంస్మరణ సభను విజయవంతం చేయాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ మాజీ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ నియోజకవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. పార్టీ అనుబంధ సంఘాల బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం నిబద్ధతతో కడదాక పనిచేశారని అన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగేందుకు సెప్టెంబరు 10వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలో దేవరకొండ రోడ్డులో జీఎల్ గార్డెన్‌లో నిర్వహించనున్న సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు ఉదయ్‌కుమార్, రామలింగం, బిల్ల కనకయ్య, ఎండి సయీద్, వలపట్ల వెంకన్న, యాదగిరి, దాసర్ల దుర్గమ్మ, ఎర్రబోతు పద్మ, శాంత, రాజేశ్వరి, షమీం, మట్టయ్య పాల్గొన్నారు.

విద్యను ప్రైవేటీకరణ చేయవద్దు : పీఎస్‌యూ



కరపత్రాలు విడుదల చేస్తున్న పీఎస్‌యూ నాయకులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యను ప్రైవేటీకరణ చేయవద్దని ప్రొగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ (పీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు అన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీఎస్‌యూ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను సోమవారం పట్టణంలోని అమరవీరుల పార్కులో ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో విద్య ప్రైవేటు శక్తుల దోపిడీకి గురవుతోందన్నారు. అక్షరాస్యతను పెంచి అసమానలతను దూరం చేసే విద్యను ప్రజలందరికీ అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యాలయాల్లో పర్యటిస్తూ, సమస్యలు గుర్తిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మచ్చ వంశీ, నాయకులు రవికుమార్, అభి, మనోజ్, మహేష్, అజయ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో సంప్రోక్షణ పూజలు



చింతపల్లి వీటీనగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

చింతపల్లి,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల, వేంకటేశ్వరనగర్ రామలింగేశ్వర, వేణుగోపాలస్వామి ఆలయాల్లో సోమవారం అర్చకులు సంప్రోక్షణ పూజలు చేశారు. చంద్రగ్రహణం అనంతరం ఆలయాల్లోని దేవతామూర్తులకు పంచమృతాభిషేకంతో పాటు సహస్రనామా శతనామావళి పూజ లు భక్తిశ్రద్ధలతో జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వేతనాల్లో 'కోత'

(5వ పేజీ తరువాయి)

పంచాయతీల్లో సిబ్బందికి వేతనాల్లో కోతపెట్టారు. ప్రభుత్వం ఎంపీడబ్ల్యూఎస్‌గా నిర్ణయించిన రూ.9500కు అదనంగా పెంచిన వేతనాన్ని ఇవ్వడాన్ని ప్రభుత్వం తప్పుబట్టింది. ఎంపీడబ్ల్యూఎస్‌గా నిర్ణయించిన వేతనానికి అదనంగా సాధారణ నిధల నుంచి వేతనాన్ని చెల్లించడమంటే రెండు పర్యాయాలు వేతనాన్ని చెల్లించడమేనన్నట్లు భావించింది. ఇలా చెల్లిస్తున్న గ్రామపంచాయతీ పంచాయతీ కార్యదర్శులకు డీపీవో ద్వారా మెమో జారీచేసింది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి గ్రీన్‌చానల్ ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన రూ.9500 వేతనం మాత్రమే అందింది. జీపీ సాధారణ నిధుల నుంచి ఇచ్చే అదనపు వేతనాన్ని నిలిపివేశారు. దీంతో మేజర్ గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి వేతనాలు పెరగడమేమో కాని ఉన్న వేతనాల్లో కోత పడే పరిస్థితి దాపురించింది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వేతనం



గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి గ్రీన్‌చానల్ ద్వారానే వేతనాలు చెల్లించాలని ఆదేశాలున్నాయి. అంతకు మించి చెల్లించిన పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారుల నుంచి తాఖీదులు అందాయి. ఎంపీడబ్ల్యూఎస్‌గా ఎంత వేతనం ఇవ్వాలో అంతే వేతనాన్ని గ్రీన్‌చానల్ ద్వారా చెల్లిస్తున్నాం. పాలకవర్గాల తీర్మానం ద్వారా ఇప్పటివరకు జనరల్ ఫండ్ నుంచి చెల్లించిన మిగతా వేతనాలను ఇప్పుడు చెల్లించలేం.

\- ఎంపీవో, సుధాకర్, నార్కట్‌పల్లి